Follow: @ANNTELUGU

ANN తెలుగు

03-09-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 236 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నిరంతరం రైతుల కోసమే వైఎస్సార్ తపించారు

**'వైఎస్ఆర్ అవార్డుల ప్రదానోత్సవ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఢిల్లీ, మహా :** వైఎస్ఆర్ జీవించి ఉన్నంత కాలం నిరంతరం రైతుల సంక్షేమం కోసమే పరితపించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన 'వైఎస్ఆర్ అవార్డుల ప్రదానోత్సవ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి, కేవీపీ రామచంద్ర రావు ల మధ్య ఉన్న అనుబంధం రాజకీయాలకు అతీతమైనదని, వారి బంధం సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వైఎస్ఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగించేందుకే కేవీపీ ఫౌండేషన్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. చారిత్రాత్మక పాదయాత్ర చేసి పేదల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారని, అధికారంలోకి రాగానే రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని గుర్తు చేశారు.

**నెహ్రూ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు**

దేశ తొలి ప్రధాని విద్య, సాగునీటి రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని రేవంత్ రెడ్డి తెలిపారు. నెహ్రూ హయాంలోనే దేశంలో

మిగతా3వ పేజీలో

**టాప్ న్యూస్**

### ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు చంద్రబాబుకు రైతుల జేజేలు

- దశాబ్దాల నిరీక్షణకు తెర
- పాయకరావుపేట వద్ద నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు



04

### వైఎస్సార్ రాజ్యం తీసుకొస్తాం

- రాబోయేది రాజశేఖర్ రెడ్డి యుగమే
- రాజగోపాల్ రెడ్డి సంచలనం



03

### కేపీహెచ్‌బీలో గజం రూ.2.70 లక్షలు.

హౌసింగ్ బోర్డు వేలంలో రికార్డు ధర



03

# కొండా సురేఖ తిరుగుబాటు

## తనను బర్తరఫ్ చేస్తే బీసీలంతా ఏకమవుతారని హెచ్చరిక

- భట్టి విక్రమార్క, పొంగులేటి కమిషన్ల ఆరోపణలపై చర్యలేవంటూ ప్రశ్నలు
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ.. లేఖ అందజేత
- ఆ లేఖలో సంచలనాలున్నాయంటూ స్టేట్ మెంట్
- తనను పదవిలో కొనసాగించాలని హైకమాండ్ కు రిక్వెస్ట్
- ఢిల్లీలో కొండా వ్యూహాత్మక రాజకీయం



**ఢిల్లీ, మహా :** మంత్రి కొండా సురేఖ డిసైడైపోయారు. ఢిల్లీ వేదికగా సీఎంతో పాటు కీలకమంత్రులను, నేతలను టార్గెట్ చేశారు. పదేళ్ళు తానే సీఎం అంటూ ప్రకటించుకోవడంపైనా అభ్యంతరపెట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలపై కమిషన్ల ఆరోపణలున్నాయంటూ మీడియా సమక్షంలో నేరుగా మంత్రే ఆరోపించడం విస్మయపరిచే అంశం. తనపై చర్య డిసైడ్ అయ్యే కొండా తిరుగుబాటు మంత్రాన్ని ఎంచుకున్నారని, ఢిల్లీ వేదికగా నేరుగా కాంగ్రెస్ నేతలపైనే బెదిరింపులకు దిగారన్న చర్చ జరుగుతోంది. కొండా తిరుగుబాటు వ్యూహంతోనే బీసీ కార్డు ప్రయోగించడంతో పాటు త వద్ద ఉన్న ఆయుధాలన్నింటినీ ఢిల్లీలో ప్రదర్శించింది.

మిగత 3వ పేజీలో

### కొండా సురేఖ.. బెదిరింపులు

1. నేను పద్మశాలి.. నా భర్త మున్నూరుకాపు. మేం 16శాతంకు పైగా ఉన్నాం. నాపై చర్య తీసుకుంటే బీసీలంతా ఏకమవుతారు.
2. భట్టి విక్రమార్క, పొంగులేటిపై కమిషన్ల ఆరోపణలు లేవా? నాపై చర్యలెందుకు తీసుకుంటారు? బీసీననేనా?
3. ఖర్గేకు లేఖ ఇచ్చా. ఆ లేఖలో సంచలనాలున్నాయని పేర్కొనడం ద్వారా ఖర్గేకు లేఖ పేరుతో టార్గెటెడ్ మంత్రులు, నేతలపై ఆరోపణలను మీడియాకు లీక్ చేసే అవకాశముంది.
4. తన ఓఎస్డీ సుమంత్ ను అనవసరంగా వేధిస్తున్నారు. సుమంత్ ప్రెస్ మీట్ పెడితే అందరి బండారం బయటపడుతుంది.
5. నా కూతురు సుస్మిత తప్పేం లేదు. సీఎం ఆ నియోజకవర్గానికి రెచ్చగొట్టడం వల్లే రియాక్ట్ అయింది. సీఎంకు అభ్యర్థిని ప్రకటించే అధికారం ఎక్కడిది?
6. నాపై ఆరోపణలుచేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులకు షోకాజ్ నోటీసులు ఎందుకివ్వలేదు? ఆ ఆరోఫణలు ఎవరు చేయించారో నాకు తెలుసు.

### ఖర్గేతో రేవంత్, భట్టి భేటీ కొండా ఎపిసోడ్ క్లైమాక్స్

కేసీ వేణుగోపాల్ తో సీఎం రేవంత్, మీనాక్షి, పీసీసీ చీఫ్ చర్చలు

03



# శంషాబాద్‌లో జీవో 111 కు తూట్లు..!

## అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు ...!

- యథేచ్ఛగా కొనసాగుతున్న భారీ షెడ్లు...!
- కాగితాలకే పరిమితమైన ప్రభుత్వ ఆంక్షలు...!
- అటువైపు కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు...!
- భారీగా ముడుపులు ముట్టాయంటూ ఆరోపణలు...!
- తనిఖీలు లేకపోవడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు...!
- నిబంధనల అమలులో అధికారుల వైఫల్యం...!
- ప్రభుత్వ ఆదాయానికి గండి...!
- ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న స్థానికులు...!

02













ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిరక్షణను అధికార యంత్రాంగం పూర్తిగా గాలికొదిలేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్రాగు నీరుతో పాటు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తీసుకొచ్చిన చారిత్రాత్మక జీవో 111 ఎం.ఎ కు కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తూ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు.శంషాబాద్ మండలం పూర్తిగా జీవో 111 పరిధిలో ఉన్నప్పటికీ, భారీ షెడ్లు, గోదాములు, బహుళ అంతస్థుల వాణిజ్య భవనాలు యథేచ్ఛగా వెలుస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. నిర్మాణాల ప్రారంభ దశలోనే అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మౌనంగా వ్యవహరించడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని స్థానికులు మండిపడుతున్నారు. కోట్ల రూపాయల లాభాల కోసం జలాశయాల పరిరక్షణ లక్ష్యాలను తుంగలో తొక్కుతూ నిర్మాణ దందా కొనసాగుతోందని, నగర దాహార్తిని తీర్చిన ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల ఉనికినే ప్రమాదంలోకి నెట్టే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమయ్యారని, ఇంతమంది అధికారులు ఉన్నా అక్రమాలను నియంత్రించలేకపోతే వారి అవసరమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## తెలంగాణలో రక్షణ ఎక్స్ పో

### రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి

03

- భారత్ ఫ్యూచర్ సిటీలో రక్షణ ఎక్స్‌పో నిర్వహణకు సన్నాహాలు
- ఎయిర్‌షోతో పాటు అత్యాధునిక రక్షణ ప్రదర్శనలు నిర్వహణ
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి మరో 750 ఎకరాల భూసేకరణ
- దేవరకద్రలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416 ఎకరాల కేటాయింపు



### ఉత్తర తెలంగాణ ఆకాశానికి కొత్త రెక్కలు!

- మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు వేగం.
- డిసెంబరులో మామునూరు పనులకు శంకుస్థాపన.
- ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భేటీ.

02



### ప్రపంచంలోని మూడు శక్తుల్లో భారత్..!

- చైనా, రష్యాతో పాటు భారత్ అత్యంత శక్తిమంతమైన దేశమన్న లుకాషెంకో.
- ఉగ్రవాదంపై మోదీ గట్టి సందేశం.

03

### ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం.


- రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి.
- ఉద్యాన అధికారి మధుసూదన్.

02

## హైదరాబాద్ ట్రాఫిక్‌కు భారీ ఊరట!

- సైదాబాద్ ఉక్కు వంతెన సిద్ధం.
- నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం.

03





# కొండా సురేఖ తిరుగుబాటు

(మొదటి పేజీ తరువాయి )



రాజీనామా ప్రసక్తేలేదని తేల్చిచెబుతూనే.. తనపై చర్య తీసుకుంటే ప్లాన్ బి ఉంటుందని కొండా మురళి చెప్పినట్లు కొండా సురేఖ అస్త్రాలు, వ్యూహాలన్నీ ఢిల్లీ మీడియా ముందు పరోక్షంగా వెల్లడించారు.

**పదవిలో కొనసాగించాలని కోరా**

కాంగ్రెస్ హైకమాండ్‌కు తాను చెప్పాల్సినదంతా చెప్పానని మంత్రి కొండా సురేఖ వివరించారు. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారన్నారు. తన బిడ్డ స్వతంత్రంగా ఉందని వివరించారు. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నానన్నారు. ఆమె జీవితం ఆమె ఇష్టమని సురేఖ పేర్కొన్నారు. తనతో పాటు తన భర్త రాజకీయ జీవితం మా ఇష్టం అని తెలిపారు. తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని కొండా సురేఖ చెప్పారు. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని వివరించారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నానని తెలిపారు. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరానని ఆమె వివరించారు.

**నాపై ఆరోపణలు చేసిన వారికి నోటీసులేవీ?**

తన కుమార్తె వ్యాఖ్యలపై తాను స్పందించనని కొండా సురేఖ తెలిపారు. సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్నారు. రోజూ ఎంతో మంది మాట్లాడతారని అందులో సుస్మిత కూడా ఒకరని కొండా సురేఖ అన్నారు. తన బిడ్డ కనుక తనను బాధ్యురాలిని చేయడం సరికాదని ఆమె వివరించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయనన్నారు. తన వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పానట్లు వెల్లడించారు. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారని సురేఖ వివరించారు. పార్టీలో కొంతమందితో తనపై ఆరోపణలు చేయించారన్నారు. ఎవరు అలా చేయించారో తనకు తెలుసని కొండా సురేఖ పేర్కొన్నారు. పేర్లు చెబితే వివాదం అవుతుందన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సురేఖ అభిప్రాయపడ్డారు. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలని ఆమె కోరారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని అన్నారు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నానని అందుకే ఇక్కడికి వచ్చి తన బాధ చెప్పుకొన్నానన్నారు. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చామన్న ఆమె, పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగా తన ఆలోచన ఉంటుందని కొండా సురేఖ అన్నారు.

# ఉత్తర తెలంగాణ ఆకాశానికి కొత్త రెక్కలు!

ఢిల్లీ, మహా : తెలంగాణలో ప్రాంతీయ విమానయాన రంగానికి కొత్త ఊపునిచ్చే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. వరంగల్ మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కోరారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రితో సమావేశమైన ముఖ్యమంత్రి.. రెండు విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ, రన్‌వే, ప్రయాణికుల సౌకర్యాలు, సరకు రవాణా, విమానాల మరమ్మతు కేంద్రాల ఏర్పాటుపై విస్తృతంగా చర్చించారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి అప్పగించిందని తెలిపారు.

**మామునూరుకు డిసెంబరులో శంకుస్థాపన**

వరంగల్ మామునూరు విమానాశ్రయం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక హామీ ఇచ్చింది. నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లను రెండు వారాల్లో పిలిచి, డిసెంబరు నాటికి ప్రక్రియను పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రికి తెలిపారు. అదే నెలలో పనులకు శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీంతో దశాబ్దాలుగా వరంగల్ ప్రజలు ఎదురుచూస్తున్న మామునూరు విమానాశ్రయానికి నిర్మాణ దశలో మరింత స్పష్టత వచ్చినట్లయింది.

వరంగల్ తెలంగాణలో రెండో అతిపెద్ద నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మామునూరు విమానాశ్రయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, కరీంనగర్ జిల్లాలకు ఇది కీలకమైన విమాన రవాణా కేంద్రంగా మారే అవకాశం ఉంది. పారిశ్రామిక రంగం, వస్త్ర పరిశ్రమ, విద్య, వైద్యం, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తే ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతం లభించనుంది.

**కాకతీయ కళావైభవం ప్రతిబింబించేలా..**

మామునూరు విమానాశ్రయాన్ని కేవలం ప్రయాణికుల రాకపోకలకు పరిమితం చేయకుండా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. విమానాశ్రయ రూపకల్పనలో కాకతీయుల చరిత్ర, సంస్కృతి, కళావైభవం ప్రతిబింబించేలా చూడాలని గతంలో ముఖ్యమంత్రి కోరారు. విమానాశ్రయంలో సరకు రవాణా సౌకర్యాలు, విమానాల నిర్వహణ, మరమ్మతులు, సమగ్ర తనిఖీల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కూడా కేంద్రాన్ని కోరారు.

**ఆదిలాబాద్‌కు రక్షణ.. పౌర విమానయానానికి సమన్వయం**

ఆదిలాబాద్ విమానాశ్రయంపైనా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. రన్‌వేను తుది రూపంలో ఖరారు చేసేందుకు రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఆదిలాబాద్‌లో పౌర, రక్షణ అవసరాలను సమన్వయం చేసే సంయుక్త వినియోగ విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన ఉంది.ఇప్పటికే ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ, మౌలిక వసతుల అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విమానాశ్రయాన్ని విస్తృత స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పౌర విమానయానంతో పాటు రక్షణ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుంటోంది. ప్రయాణికుల టెర్మినల్‌తో పాటు సరకు రవాణా కేంద్రం, విమానాల నిర్వహణ, మరమ్మతులు, సమగ్ర తనిఖీల కేంద్రం, విమానాల నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.

పారిశ్రామిక ప్రగతికి విమానాశ్రయాలే కీలకం

మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తర, ఉత్తర మధ్య తెలంగాణ ప్రాంతాల అభివృద్ధికి కొత్త అవకాశాలు తెరుచుకోనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయంపై ఆధారపడాల్సి వస్తున్న అనేక ప్రాంతాలకు సమీపంలోనే విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయి. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, వైద్య సేవలు పొందే ప్రజలకు ప్రయాణ సమయం తగ్గనుంది.

ప్రత్యేకంగా వరంగల్‌లో అభివృద్ధి చెందుతున్న వస్త్ర పరిశ్రమకు విమాన కనెక్టివిటీ ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర వంటి భారీ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు కూడా మామునూరు విమానాశ్రయం కీలకంగా మారనుంది.

**హెలీ టూరిజానికి ప్రోత్సాహం**

తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత విస్తరించేందుకు హెలికాప్టర్ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను హెలికాప్టర్ సేవలతో అనుసంధానిస్తే దేశ, విదేశీ పర్యాటకులను మరింతగా ఆకర్షించే అవకాశం ఉంటుందని వివరించారు.

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో సముద్ర విమానం దిగేందుకు ఉన్న అవకాశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. దీనికి సంబంధించిన అధ్యయన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే హైదరాబాద్ పర్యాటక రంగంలో సరికొత్త ఆకర్షణగా నిలిచే అవకాశం ఉంది.

**కేంద్ర–రాష్ట్ర సమన్వయంతో ముందడుగు**

విమానాశ్రయాల వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అత్యంత కీలకం. భూసేకరణ, రక్షణ శాఖ అనుమతులు, సాంకేతిక అంశాలు, రన్‌వే నిర్మాణం, పర్యావరణ అనుమతులు, నిర్మాణ టెండర్లు తదితర దశలను సమర్థవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నేరుగా కేంద్ర మంత్రితో సమావేశమై పెండింగ్ అంశాలను చర్చించడం ప్రాజెక్టుల వేగవంతమైన అమలుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేస్తోంది.గతంలోనే మామునూరు విమానాశ్రయానికి అవసరమైన అదనపు భూసేకరణను తెలంగాణ ప్రభుత్వం వేగంగా పూర్తి చేసినందుకు కేంద్ర మంత్రి ప్రశంసలు వ్యక్తం చేశారు. విమానాశ్రయం నిర్మాణం త్వరగా ప్రారంభించేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని కూడా హామీ ఇచ్చారు.

# ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం

**ఖమ్మం, మహా:** ఆయిల్‌పామ్ సాగుతో రైతులు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ తెలిపారు. తల్లాడ మండలం కొడవటిమెట్టలోని ఆయిల్‌పామ్ తోటను ఆయన పరిశీలించి, పంట పరిస్థితి, మొక్కల పెరుగుదల, సాగు పద్ధతులను పరిశీలించారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, తెగుళ్ల నియంత్రణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో వక్క, కోకో, మునగ, సుగంధ పంటలను అంతర పంటలుగా సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోతుల బెడద తక్కువగా ఉండటంతో పాటు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం ఆయిల్‌పామ్‌కు ఉందన్నారు. అనంతరం తల్లాడలో మిరప నర్సరీలను తనిఖీ చేసి నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి జి. నగేష్, ఆయిల్‌పామ్ రైతులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో జీవో 111కు తూట్లు..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:**

జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించడంతో పాటు ఈ జలాశయాల పరివాహక ప్రాంతాలను కాలుష్యం, అనియంత్రిత పట్టణీకరణ నుంచి కాపాడేందుకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నెం.111 ఎం.ఎ ను జారీ చేసింది. 1993 మార్చి 30 న ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి. అర్జున్‌రావు ఆధ్వర్యంలో రూపొందిన ఈ ఉత్తర్వుల్లో జంట జలాశయాల పరివాహక ప్రాంతాల్లో అభివృద్ధి, నిర్మాణ కార్యకలాపాలపై పలు నియంత్రణలు విధించారు. జలాశయాలకు సుమారు 10 కిలోమీటర్ల పరిధిలోని 84 గ్రామాల్లో ఎలాంటి లేఅవుట్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు, చెక్ డ్యామ్ లు, కాంక్రీట్ వాల్స్ చేపట్టకూడదనే నిషేధాజ్ఞలను తుంగలో తొక్కి రియల్ మాఫియా పెట్రేగి పోతోంది. లేఅవుట్లు, భారీ నిర్మాణాలు, కాలుష్యకారక పరిశ్రమలు తదితర కార్యకలాపాలను నియంత్రించడం ద్వారా జలాశయాల్లోకి చేరే నీటి నాణ్యతను కాపాడటం, వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూడటం, భవిష్యత్‌లో హైదరాబాద్ నగరానికి తాగునీటి కొరత ఏర్పడకుండా జల వనరులను పరిరక్షించడమే జీవో 111 ప్రధాన ఉద్దేశ్యంగా జారీ చేశారు. ఈ నిబంధనల అమలు కోసం ప్రత్యేకంగా నియంత్రిత ప్రాంతాలను గుర్తించి భూమి వినియోగం, లేఅవుట్లు, నిర్మాణాలు తదితర అంశాలపై ఆంక్షలు విధించారు.

అయితే ప్రస్తుతం శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో జీవో 111 ఎం.ఎ నిబంధనలను బేఖాతరు చేస్తూ భారీ షెడ్లు, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తుండటంతో అసలు ప్రభుత్వ ఆంక్షలు అమలవుతున్నాయా? లేక కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వివరాలలోకి వెళ్తే...

**ఐకాన్ మార్బుల్ ఎదురుగా.**

**. ప్రధాన రహదారి పక్కన రెండు భారీ షెడ్లు:**

శంషాబాద్ నుంచి శాతంరాయ్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో శంషాబాద్ జోనల్ కమిషనర్ ఆఫీసుకి కూతవేటు దూరంలో ఐకాన్ మార్బుల్ ఎదురుగా, పక్కన రెండు భారీ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వాణిజ్య అవసరాల కోసం నిర్మిస్తున్న ఈ షెడ్లకు సంబంధించి ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు, స్థల వినియోగ అనుమతులు లేకుండా యధేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారి పక్కనే అక్రమ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

**ఉమ్దానగర్ ఫ్లైఓవర్ పక్కనే మరో భారీ షెడ్:**

ఉమ్దానగర్ ఫ్లైఓవర్ సమీపంలో మరో భారీ వాణిజ్య షెడ్ నిర్మాణం జోరుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందకుండానే నిర్మాణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఇంత భారీ స్థాయిలో పనులు జరుగుతున్నా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీఓ 111 ఎం. ఎ నిబంధనలకు లోబడి ఉండాల్సిన ప్రాంతంలో నిర్మాణాలు సాగుతున్నా అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడంపై స్థానికంగా పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

**మామిడిపల్లిలోనూ భారీ షెడ్:**

మామిడిపల్లి ప్రాంతంలో మరో భారీ షెడ్ నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవైపు నివాస ప్రాంతాలు విస్తరిస్తుండగా మరోవైపు భారీ వాణిజ్య నిర్మాణాలు వెలుస్తుండటంతో భవిష్యత్‌లో ట్రాఫిక్, పార్కింగ్, మురుగునీటి నిర్వహణ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ అనుమతులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఏడు అంతస్తుల నిర్మాణం:**

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని సెల్లార్ కాకుండా ఏడు బహుళ అంతస్తుల నిర్మాణం కొనసాగుతోంది. అవసరమైన భవన నిర్మాణ అనుమతులు తీసుకోకుండానే ఇంత భారీ నిర్మాణాన్ని చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీఓ 111 ఎం.ఎ నిబంధనలు అమల్లో ఉన్న ప్రాంతంలోనే నిబంధనలను బేఖాతరు చేస్తూ నిర్మాణం సాగుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో భారీ ఎత్తైన భవనాలు నిర్మిస్తున్న నేపథ్యంలో విమాన భద్రతకు సంబంధించిన ఎత్తు పరిమితులు, అవసరమైన విమానాశ్రయ ప్రాధికార సంస్థ అనుమతులు తీసుకున్నారా లేదా అన్నదానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఏడు అంతస్తుల నిర్మాణం సాగుతున్నా అడ్డుకునే చర్యలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రైల్వే బ్రిడ్జి దగ్గర అంజయ్యనగర్ ఘటనను తలపిస్తున్న జీ+7 బహుళ అంతస్తుల నిర్మాణం..!**

బృందావన్ కాలనీ, అమెరికన్ హాస్పిటల్ కాంప్లెక్స్ సమీపంలో (రైల్వే బ్రిడ్జి వద్ద) అనుమతులు లేకుండా భారీ బహుళ అంతస్తుల భవనం నిర్మాణం సాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో అక్రమ నిర్మాణం కూలిన ఘటనను తలపించేలా ఈ నిర్మాణం కొనసాగుతుండటం కలకలం రేపుతోంది. కేవలం 50 చదరపు గజాల విస్తీర్ణంలోనే సెల్లార్‌తో పాటు జీ+7 అంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అతి తక్కువ విస్తీర్ణంలో ఇంత భారీ భవనాన్ని నిర్మించడం, అందులోనూ జీఓ 111 పరిధిలోనే నిర్మాణ పనులు చేపట్టడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 50 గజాల్లో సెల్లార్ నుంచి జీ+7 వరకు భవనం నిర్మించేందుకు నిబంధనలు అనుమతిస్తాయా? జీఓ 111 పరిధిలో ఇలాంటి నిర్మాణానికి ఎవరు అనుమతులు ఇచ్చారు? అసలు అనుమతులు లేకుండానే నిర్మాణం సాగుతుంటే అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదు? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే నిర్మాణాన్ని పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తక్షణమే పనులు నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే మరో బహుళ అంతస్తుల నిర్మాణం:**

ఔటర్ రింగ్‌రోడ్డు పక్కనే మరో బహుళ అంతస్తుల భవన నిర్మాణం కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం పొందాల్సిన అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రహదారి మార్జిన్లు, భవన నిర్మాణ పరిమితులను పట్టించుకోకుండా పనులు సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జీఓ 111 ఎం.ఎ నిబంధనలకు లోబడి ఉండాల్సిన ప్రాంతంలో ఇలాంటి నిర్మాణాలు వెలుస్తుండటంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**డీటీడీసీ కొరియర్ పక్కనే భారీ అపార్టుమెంట్లు :**

ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో డీటీడీసీ కొరియర్ కార్యాలయం పక్కనే ఆరు అంతస్థులతో భారీ అపార్టుమెంట్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి .సంబంధిత అనుమతులు తీసుకోకుండానే నిర్మాణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకే ప్రాంతంలో వరుసగా నిర్మాణాలు వెలుస్తుండటంతో పరిసర ప్రాంతాలపై భవిష్యత్‌లో పడే ప్రభావంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీఓ 111 పరిధిలోని నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ వద్ద భారీ వాణిజ్య నిర్మాణం**

తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ వద్ద లిమ్స్ ఆస్పత్రి సమీపంలో భారీ వాణిజ్య నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీగా ఉండే ప్రాంతంలో భారీ వాణిజ్య భవనం నిర్మాణం పూర్తయితే వాహనాల రాకపోకలు, పార్కింగ్, రహదారి భద్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. భవనానికి సంబంధించిన అనుమతులు, నిర్మాణ ప్రణాళిక, రహదారి మార్జిన్లను అధికారులు పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**రాయల్ విల్లాస్ వద్ద మరో అక్రమ నిర్మాణం :**

రాయల్ విల్లాస్ పరిసర ప్రాంతంలోనూ మరిన్ని బహుళ అంతస్థుల నిర్మాణాలు కొనసాగుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. జీవో 111 పరిధిలోని ఈ నివాస ప్రాంతాల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**వెలంకన్నీ నగర్‌లో పలు బహుళ అంతస్తుల నిర్మాణాలు:**

వెలంకన్నీ నగర్ పరిధిలో ఒకటి కాదు.. పలు బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అవసరమైన అనుమతులు పొందకుండానే నిర్మాణదారులు ఒకరిని చూసి మరొకరు భారీ భవనాలు నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం మాత్రం స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే అడ్డుకోవాల్సిన పరిస్థితుల్లో అవి శరవేగంగా కొనసాగుతుండటంతో అక్రమ నిర్మాణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. జీఓ 111 ఎం.ఎ నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపడుతున్న నిర్మాణాలపై సమగ్ర పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**పాశంబండలోనూ బహుళ అంతస్తుల భవనాలు:**

పాశంబండ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా పలు బహుళ అంతస్తుల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. అవసరమైన అనుమతులు పొందకుండానే భారీ భవనాలను చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణాలు ఒక్కొక్కటిగా వెలుస్తున్నా వాటిని అడ్డుకునే చర్యలు లేకపోవడంతో అక్రమార్కులు మరింతగా రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తుండటంతో పాశంబండ ప్రాంత రూపురేఖలే మారిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మజీద్ అబ్దుర్‌రహ్మాన్ రోడ్డులోనూ భారీ నిర్మాణాలు..**

మజీద్ అబ్దుర్‌రహ్మాన్ రోడ్డులోనూ అనుమతులు లేకుండా భారీ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారిని ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నా వాటిని అడ్డుకునే చర్యలు లేకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**3టౌన్ స్క్వేర్ సూట్స్ హోటల్ పక్కన 'సెలబ్రిటీ హోమ్స్':**

టౌన్ స్క్వేర్ సూట్స్ హోటల్ పక్కనే 'సెలబ్రిటీ హోమ్స్' పేరుతో పలు నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. జీఓ 111 ఎం.ఎ నిబంధనలను పట్టించుకోకుండా అవసరమైన అనుమతులు పొందకుండానే నిర్మాణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విమానాశ్రయానికి సమీపంలోనే భారీ నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో భవనాల ఎత్తు, భూ వినియోగం, నిర్మాణ భద్రతకు సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవసరమైన అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగుతున్నా అడ్డుకునే చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీఓ 111ఎం.ఎ పరిధిలో ఇలాంటి నిర్మాణాలకు ఎలా అవకాశం కల్పిస్తున్నారో ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

**టౌన్‌ప్లానింగ్ పర్యవేక్షణ కరువు..**

శంషాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే భారీ షెడ్లు, వందలాది బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణంలో ఉన్నా వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి నిలువరించే పర్యవేక్షణ వ్యవస్థ కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల సమీపం, ఔటర్ రింగ్‌రోడ్డు పరిసరాలు, విమానాశ్రయానికి చేరువ ప్రాంతాల్లోనే నిర్మాణాలు సాగుతున్నా అక్రమాలను అడ్డుకునే చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జీఓ 111ఎం.ఎ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి, ప్రతి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూ వినియోగం, నిర్మాణ ఎత్తు, అవసరమైన ఇతర శాఖల అనుమతులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ..?**

శంషాబాద్ పరిధిలోని ఐకాన్ మార్బుల్, ఉమ్మదానగర్ ఫ్లైఓవర్, మామిడిపల్లి, తహసీల్దార్ కార్యాలయం, ఔటర్ రింగ్‌రోడ్డు, డీటీడీసీ కొరియర్ సమీపం, తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ , రాయల్ విల్లాస్, వెలంకన్నీ నగర్, పాశంబండ, మజీద్ అబ్దుర్‌రహ్మాన్ రోడ్డు, టౌన్ స్క్వేర్ సూట్స్ పరిసరాల్లో వరుసగా భారీ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ముడుపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి:

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. నిర్మాణదారులతో కొందరు అధికారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు కూడా వస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు.

**ఒక్కసారి సమగ్ర సర్వే చేస్తే..**

శంషాబాద్ మండల పరిధిలో జీవో 111ఎం.ఎ నిబంధనల అమలు, భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్లు, భూ వినియోగం, నిర్మాణ విస్తీర్ణం తదితర అంశాలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు చెబుతున్నారు. షెడ్లతో పాటు, బహుళ అంతస్థుల నిర్మాణాలు 4 నుండి 5 వందల అక్రమ నిర్మాణాలు సాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారుల జోక్యం చేసుకుని.. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలి!**

జీఓ 111 ఎం. ఎ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించాల్సిన అవసరం ఉంది. శంషాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వెలుస్తున్న భారీ షెడ్లు, బహుళ అంతస్తుల భవనాలపై సమగ్ర క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, ప్రతి నిర్మాణానికి సంబంధించిన భూ వినియోగం, నిర్మాణ ఎత్తు, రహదారి మార్జిన్లు, ఇతర శాఖల అనుమతులను నిశితంగా పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జీఓ 111 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలితే వాటిని తక్షణమే కూల్చివేతలు జరపాలని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జంట జలాశయాల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత కోసం తీసుకొచ్చిన జీఓ 111ఎం.ఎ కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల పుస్తకాల్లోనే మిగిలిపోతే దాని అసలు లక్ష్యమే దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ నిర్మాణాలు ఒక్కొక్కటిగా పుట్టుకొస్తే భవిష్యత్‌లో వాటిని నియంత్రించడం మరింత కష్టతరమవుతుందని హెచ్చరిస్తున్నారు. అనుమతులు లేకుండా సాగుతున్న నిర్మాణాలపై వెంటనే కొరడా ఝుళిపించి, జీఓ 111 నిబంధనలను ఉల్లంఘించే వారికి ఎలాంటి మినహాయింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.





పాశంబండ లోని సెలబ్రిటీ హోమ్స్ పేరుతో నిర్మాణాలు






ఐకాన్ మార్బుల్స్ పక్కన భారీ షెడ్డు





వేలంకన్నీ నగర్ ఎదురుగా వరన్స్ విల్లా





ఔటర్ రింగ్ రోడ్డు డీటీడీసీ కొరియర్ పక్కన భారీ అపార్ట్మెంట్స్ నిర్మాణం





ఐకాన్ మార్బుల్స్ ఎదురుగా భారీ షెడ్డు



వెలంకన్నీ నగర్ లో బహుళ అంతస్తుల నిర్మాణం...



అమెరికన్ హాస్పిటల్ కాంప్లెక్స్, రైల్వే బ్రిడ్జి పక్కన సెల్లార్, జీ + 7 బహుళ అంతస్తుల నిర్మాణం






తహసీల్దార్ కార్యాలయం వెళ్లే ప్రధాన రహదారిలో



ఉమ్దా నగర్ ఫ్లై ఓవర్ పక్కన భారీ షెడ్డు



మామిడిపల్లి లో భారీ షెడ్డు





మజీద్ అబ్బుర్ రెహమాన్ నగర్ లో బహుళ అంతస్తుల నిర్మాణం






ఔటర్ రింగ్ రోడ్డు పక్కన డీటీడీసీ కొరియర్ దారిలో



రాయల్ విల్లాస్ పక్కన బహుళ అంతస్తుల నిర్మాణం



మజీద్ అబ్బుర్ రెహ్మాన్ నగర్ లో బహుళ అంతస్తుల నిర్మాణం



పాశంబండ లోని సెలబ్రిటీ హోమ్స్ పేరుతో నిర్మాణాలు

# వినూత్న రీతిలో వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాల సందేశం


**పోస్టర్ ను ఆవిష్కరించిన వరంగల్ సీపీ ఎన్ శ్వేత ఐపిఎస్**



**వరంగల్, క్రైమ్ మహా ;** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్ ను బుధవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ ఆవిష్కరించారు.వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్ లో అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీ సూచించారు. ఎవరైనా తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఈమెయిల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌ల ను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బహుమతులు, లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్ లు ఏర్పాటు చేసుకుని టూఫ్యాక్టర్ అథెంటికేషన్ వినియోగించాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ కు ఫోన్ చేయాలని, www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం స్టేషన్ ఏసీపీ వెంకటరమణ, సీఎసి బి 2 ఏసీపీ జానీ నర్సింహులు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్. ఐలు చరణ్, శివ పాల్గొన్నారు.

# కాశిబుగ్గ లో ఘనంగా పోచమ్మ బోనాలు

**హాజరైన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,మాజీ కార్పొరేటర్లు**



వరంగల్, కాశిబుగ్గ మహా ;వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని కాశిబుగ్గ లో ముదిరాజ్ సంఘం భయ్యా స్వామి ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, ఓని భాస్కర్ హాజరై అమ్మవారికి పూజలు చేసి బోనం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ శ్రావణమాసంలో జరిగే అమ్మవారి బోనాలకు ఓ విశిష్టత ఉందని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్సీ సారయ్య ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, మాజీ కౌన్సిలర్ ధూపం సంపత్ తో పాటు ముఖ్య నాయకులు గోరంటల రాజు, రామ యాదగిరి, మార్త ఆంజనేయులు, చిమ్మని వేణు, ఏకాంబరం, తోట బాలరాజు, బేతీ రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కాంగ్రెస్ లోకి బిఆర్ ఎస్ పులిగిల్ల గ్రామ సర్పంచ్ చేరిక

**కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రేవూరి**

**పరకాల, మహా ;** నడికుడ మండలం పులిగిల్ల గ్రామ సర్పంచ్ ఇనుగాల పద్మ ఐలయ్య బీఆర్ఎస్ పార్టీని వీడి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. వీరి తోపాటు బిఆర్ఎస్ నుండి వార్డు మెంబర్ ఇనుగాల సువార్త, శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు గజ్జి కైలాసం, కాంతమ్మ, పాలకుర్తి సురేష్, ఇనుగాల సుదర్శన్, బొల్లె రవీందర్, ఇనుగాల కుమార్ దాదాపు 20 మంది కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పర్నేం మల్లా రెడ్డి, జిల్లా కార్యదర్శి బచ్చటి మోహన్ రావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ విమర్శలకు అధికారం కోల్పోయిన అక్కసే కారణం




**హనుమకొండ, మహా:** అధికారం కోల్పోయామన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ డీసీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ ప్రోగ్రెస్ రిపోర్ట్ అని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఆరు గ్యారంటీల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాలకు వీసీల నియామకం, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిందన్నారు. వివిధ శాఖల్లో సుమారు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ పదేళ్లు కాలయాపన చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తొలి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. నిర్మాణాత్మక విమర్శలకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని కావ్య స్పష్టం చేశారు. అనంతరం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.

# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

**హనుమకొండ, మహా**:వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. హనుమకొండ కలెక్టరేట్ లో బుధవారం మూడు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, రాత్రి 10 గంటల తర్వాత శబ్ద కాలుష్యానికి తావివ్వకూడదని కమిషనర్ తెలిపారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్ద మండపాల వద్ద బారికేడ్లు, క్యూ లైన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లు, లైటింగ్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ స్థానిక ప్రాంతాలకు సమీపంలోనే నిమజ్జన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. అధికారులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న తెలిపారు.

# తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో



**ఢిల్లీ, మహా :** తెలంగాణను దేశ రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాల కీలక కేంద్రంగా మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలకు శ్రీకారం చుట్టింది. పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో భాగంగా ప్రతిష్ఠాత్మక రక్షణ ఎక్స్‌పో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ ఎక్స్‌పోను ప్రారంభించేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీలో రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి.. తెలంగాణలో రక్షణ రంగానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

**రక్షణ రంగానికి అంతర్జాతీయ వేదిక**

రక్షణ ఎక్స్‌పో-2026ను కేవలం వస్తు ప్రదర్శనగా కాకుండా దేశీయ రక్షణ పరిశ్రమకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించే వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సులు, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు, భారీ స్థాయి ఎయిర్‌షో నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు.

దేశవ్యాప్తంగా రక్షణ పరిశ్రమలు, అంకుర సంస్థలు, యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు ఈ ఎక్స్‌పోలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి స్వయంగా హాజరై మార్గనిర్దేశం చేస్తే రక్షణ రంగంలో కొత్త ఆవిష్కరణలకు, యువ ప్రతిభకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.

**ఆకాశంలో అద్భుత ప్రదర్శన**

రక్షణ ఎక్స్‌పోలో భాగంగా ప్రత్యేక ఎయిర్‌షో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అవసరమైన గగనతల అనుమతులు మంజూరు చేయాలని రక్షణ శాఖను ముఖ్యమంత్రి కోరారు. భారత వైమానిక దళానికి చెందిన విమానాలతో పాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రజలు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు వీక్షించేలా ప్రదర్శించాలని ప్రతిపాదించారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు కూడా ఎక్స్‌పోలో భాగస్వాములు కావాలని కోరారు.

**స్వదేశీ రక్షణ సాంకేతికతకు ప్రాధాన్యం**

'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా దేశీయంగా అభివృద్ధి చేస్తున్న రక్షణ సాంకేతికతను ఎక్స్‌పోలో విస్తృతంగా ప్రదర్శించాలని ప్రభుత్వం భావిస్తోంది. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు డీఆర్‌డీవో ప్రయోగశాలలు విస్తృతంగా పాల్గొని తమ పరిశోధనలు, ఉత్పత్తులు, సాంకేతిక సామర్థ్యాలను ప్రదర్శించాలని ముఖ్యమంత్రి కోరారు. అంతేకాకుండా విదేశీ రక్షణ శాఖల ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రతినిధులతో సమావేశాలకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా తెలంగాణలో రక్షణ తయారీ, పరిశోధన, విమానయాన, అంతరిక్ష రంగాల్లోకి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఆదిలాబాద్‌కు మరో 750 ఎకరాలు**

రక్షణ శాఖతో జరిగిన సమావేశంలో ఆదిలాబాద్ విమానాశ్రయం అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ చేపట్టిందని తెలిపారు. రక్షణ శాఖ మొత్తం 1,500 ఎకరాలు కోరిన నేపథ్యంలో మిగిలిన మరో 750 ఎకరాలను కూడా సేకరించి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్‌సింగ్‌కు వివరించారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని రక్షణ, పౌర విమానయాన అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు ఈ భూసేకరణ కీలకంగా మారనుంది. విమానాశ్రయం అభివృద్ధితో ఉత్తర తెలంగాణలో రవాణా, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది.

**దేవరకద్రలో డీఆర్‌డీఎల్‌కు భారీ భూకేటాయింపు**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ అంగీకరించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.ఈ భూమిని 33 సంవత్సరాల పాటు మొత్తం భూమికి కలిపి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే లీజును మరో రెండు సార్లు పొడిగించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. రక్షణ పరిశోధన, సాంకేతిక అభివృద్ధి రంగాల్లో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

**హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రక్షణ రంగ విస్తరణ**

ఇప్పటికే హైదరాబాద్ దేశంలోని ప్రముఖ రక్షణ, వైమానిక పరిశోధన కేంద్రాల్లో ఒకటిగా ఉంది. డీఆర్‌డీవో, హెచ్‌ఏఎల్, బీడీఎల్ తదితర సంస్థల కార్యకలాపాలతో పాటు ప్రైవేటు రక్షణ, వైమానిక సంస్థలు కూడా హైదరాబాద్ పరిసరాల్లో విస్తరిస్తున్నాయి. దేవరకద్రలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు, ఆదిలాబాద్ విమానాశ్రయ విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో రక్షణ ఎక్స్‌పో ప్రతిపాదనలు కలిపి చూస్తే తెలంగాణలో రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం స్పష్టమవుతోంది.

**పెట్టుబడులే లక్ష్యం.. యువతకు అవకాశాలే గమ్యం**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను తెలంగాణకు ఆకర్షించడమే కాకుండా రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాల్లో భారీ పెట్టుబడులకు వేదిక కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. రక్షణ పరిశ్రమల్లో పెట్టుబడులు పెరిగితే తయారీ రంగంతో పాటు అనుబంధ పరిశ్రమలు, పరిశోధన సంస్థలు, అంకుర సంస్థలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దీనివల్ల ఇంజినీరింగ్, సాంకేతిక, పరిశోధన రంగాల్లో యువతకు అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుంది.

**కేంద్ర సహకారంతో తెలంగాణకు కొత్త దిశ**

రక్షణ రంగానికి సంబంధించిన అనేక అంశాలు కేంద్ర రక్షణ శాఖ పరిధిలో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఎయిర్‌షోకు గగనతల అనుమతులు, వైమానిక దళ విమానాల భాగస్వామ్యం, త్రివిధ దళాల ప్రదర్శనలు, డీఆర్‌డీవో ప్రయోగశాలల భాగస్వామ్యం, రక్షణ ప్రభుత్వ రంగ సంస్థల పాల్గొనడం వంటి అంశాల్లో కేంద్ర సహకారం అవసరం. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్‌సింగ్‌తో ముఖ్యమంత్రి సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్‌కుమార్ షెట్కార్, పోరిక బలరాంనాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

# ప్రపంచంలోని మూడు శక్తుల్లో భారత్..!

- చైనా, రష్యాతో పాటు భారత్ అత్యంత శక్తిమంతమైన దేశమన్న లుకాషెంకో.
- ఉగ్రవాదంపై మోదీ గట్టి సందేశం.



**బిష్కెక్, మహా:** కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో భారత్‌కు అరుదైన ప్రశంస లభించింది. చైనా, రష్యాతో పాటు భారత్ ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన మూడు దేశాల్లో ఒకటని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో పేర్కొన్నారు. ఈ మూడు దేశాలకు ఆర్థిక బలం, విస్తారమైన వనరులు, అణ్వస్త్ర సామర్థ్యం ఉన్నాయని ఆయన అన్నారు.

సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదంపై భారత్ వైఖరిని స్పష్టం చేశారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండకూడదన్నారు. ఉగ్రవాదానికి నిధులు, నియామకాలు, తీవ్రవాద భావజాలం, సురక్షిత స్థావరాలు కల్పించే మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు.

ఇరాన్‌పై సైనిక దాడులపైనా ఎస్‌సీవో బిష్కెక్ ప్రకటనలో ఆందోళన వ్యక్తమైంది. ఇరాన్ సార్వభౌమత్వానికి మద్దతు తెలిపిన సభ్య దేశాలు సమస్యలకు రాజకీయ, దౌత్యపరమైన పరిష్కారమే మార్గమని పేర్కొన్నాయి. ఇదే సమయంలో యుద్ధాలు, ఘర్షణలకు ముగింపు పలికి చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని భారత్ స్పష్టం చేసింది.సదస్సు సందర్భంగా మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, ఇంధనం, అంతరిక్షం తదితర రంగాల్లో సహకారంపై చర్చించారు. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంత పరిణామాలపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. మోదీ, పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒకే వేదికపై పరస్పరం మాట్లాడుకోవడం కూడా అంతర్జాతీయంగా ఆసక్తి రేపింది. మూడు దేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాల ప్రాధాన్యాన్ని ఈ పరిణామం మరోసారి చాటిచెప్పింది.మొత్తంగా బిష్కెక్ సదస్సులో భారత్ ఉగ్రవాదంపై కఠిన వైఖరితో పాటు శాంతి, దౌత్యం, ఆర్థిక సహకారానికి ప్రాధాన్యం ఇచ్చింది. చైనా, రష్యాలతో పాటు భారత్‌ను ప్రపంచంలోని మూడు ప్రధాన శక్తుల్లో ఒకటిగా లుకాషెంకో పేర్కొనడం ఈ సదస్సులో భారత దౌత్య ప్రాధాన్యాన్ని మరింత పెంచింది.

# బెల్లంపల్లిలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో దుర్గం చిన్నయ్య నేతృత్వంలో

**బెల్లంపల్లి, మహా:** అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం నాడు బెల్లంపల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ ధర్నా ,నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీల వైఫల్యంపై నిరసన ను వ్యక్తం చేస్తూ 420 హామీల అమలుకు డిమాండ్ చేసి 420 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన,ప్రజలకు బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజలకు న్యాయం జరిగే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ జడ్పి వైస్ చైర్మన్ తోంగల సత్యనారాయణ, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నునేటి సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బత్తుల సుదర్శన్, నాయకులు సింగం గణేష్ గౌడ్, మోట పలుకుల రాజశేఖర్ ,మాజీ ఎంపీపీ శ్రీనివాస్, చంద్రవెల్లి మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్ లతోపాటు బిఆర్ఎస్ పార్టీకి చెందిన పట్టణ వార్డు కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో పాటు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు .

# కేపీహెచ్‌బీలో గజం రూ.2.70 లక్షలు.

**హైదరాబాద్, మహా. :** హైదరాబాద్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. కేపీహెచ్‌బీ ఏడో దశలో హౌసింగ్ బోర్డు నిర్వహించిన బహిరంగ వేలంలో చదరపు గజం గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు అమ్ముడైంది.ఏడో దశలోని 16 మధ్యతరగతి వర్గాల స్థలాలకు వేలం నిర్వహించగా, కనీస ధరను చదరపు గజానికి రూ.1.60 లక్షలుగా నిర్ణయించారు. భారీ డిమాండ్‌తో ఓ స్థలం రూ.2.70 లక్షలకు, మరో స్థలం రూ.2.36 లక్షలకు విక్రయమయ్యాయి. మరో రెండు స్థలాలు రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి.వేలంలో 19 మంది పోటీ పడగా, స్థలాల సగటు ధర చదరపు గజానికి రూ.1.79 లక్షలు పలికింది. హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరింది.కేపీహెచ్‌బీలో మెరుగైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు, వాణిజ్య ప్రాంతాలకు సమీపం వంటి కారణాలతో భూములకు డిమాండ్ పెరుగుతోంది. తాజా వేలం ధరలు హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌లో కేపీహెచ్‌బీకి ఉన్న భారీ డిమాండ్‌ను మరోసారి చాటిచెప్పాయి.

# వైఎస్సార్ రాజ్యం తీసుకొస్తాం

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో మళ్లీ వైఎస్ఆర్ రాజ్యం తీసుకొస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని చెప్పుకొచ్చారు. వైఎస్ఆర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పిన రాజగోపాల్ రెడ్డి.. తాను వైఎస్ఆర్ ఆశయాల కోసం పాటుపడుతానని చెప్పారు. బుధవారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము వైఎస్సార్ శిష్యులం, తామ ఆయనను మరవం అని స్పష్టం చేశారు. తనను సీఎం..సీఎం అంటున్నారు. ఆ టైం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడన్నారు. కొత్తవాళ్లు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి కబ్జా చేయాలని చూస్తే రాజగోపాల్ రెడ్డి ఊరుకోడని హెచ్చరించారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగనీయనన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలంటే ఇతర పార్టీ నాయకులను తీసుకోవడం మంచిదే అయినప్పటికీ తమనే వెలగొడతాం అంటే ఊరుకోమన్నారు. రాబోయేది రాజశేఖర్ రెడ్డి యుగమే అంటూ ఆసక్తి పెంచారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్త లకు అన్యాయం జరిగితే వాళ్ల తరుపున రాజగోపాల్ రెడ్డి పోరాడుతాడనంటూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

## నిరంతరం రైతుల కోసమే వైఎస్సార్ తపించారు

( మొదటి పేజీ తరువాయి )

ఎన్నో భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి బలమైన పునాదులు పడ్డాయని పేర్కొన్నారు. పేదలు, రైతులు, గిరిజనుల జీవితాల్లో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీలు వెలుగులు నింపారని కొనియాడారు. రైతు పంటలకు సరైన మద్దతు ధర దక్కేలా ఇందిరా గాంధీ హయాంలో విప్లవాత్మక చర్యలు తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాల వల్లే నేడు దేశంలో పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ ట్రాఫిక్‌కు భారీ ఊరట!

**హైదరాబాద్, మహా:** పాతబస్తీ ప్రజలు, వాహనదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న సైదాబాద్ ఉక్కు వంతెన గురువారం అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాయంత్రం 4 గంటలకు వంతెనను ప్రారంభించనున్నారు. అనంతరం చంచల్‌గూడ జూనియర్ కళాశాలలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. చంచల్‌గూడ ప్రభుత్వ ముద్రణాలయం నుంచి సంతోష్‌నగర్ వరకు సుమారు 3.2 కిలోమీటర్ల పొడవున నాలుగు వరుసలతో ఈ వంతెన నిర్మించారు. రూ.620 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులో భూసేకరణకు రూ.153.37 కోట్లు ఖర్చయ్యాయి. వంతెన అందుబాటులోకి రావడంతో సైదాబాద్, చంచల్‌గూడ, ఐఎస్ సదన్, చంపాపేట, కంచన్‌బాగ్, మలక్‌పేట ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశం ఉంది. నల్గొండ 'ఎక్స్' రోడ్డు నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ మీదుగా ఓవైసీ జంక్షన్ వైపు రాకపోకలు సులభతరం కానున్నాయి. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఇంధన వినియోగం, వాయు కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి ఈ వంతెన శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఖర్గేతో రేవంత్, భట్టి భేటీ కొండా ఎపిసోడ్ క్లైమాక్స్?

ఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ అంశంతో పాటు కేబినెట్ విస్తరణ, పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలపై చర్చించినట్లు సమాచారం. అనంతరం కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమావేశమయ్యారు. పార్టీ సంస్థాగత అంశాలు, కొండా సురేఖ వ్యవహారం, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనపై చర్చించినట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

**కొండాకు నిరాశే**

అధిష్ఠానాన్ని కలిసేందుకు ఢిల్లీ వెళ్లిన మంత్రి కొండా సురేఖకు ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదని సమాచారం. కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. తన కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని సురేఖ మరోసారి స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. దీంతో కొండా వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం కోసం ఉత్కంఠ కొనసాగుతోంది.

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు





**అనకాపల్లి, మహా :** దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. ఉత్తరాంధ్ర బీళ్లకు జీవం పోసేందుకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తరలివచ్చింది. ఈ చారిత్రక ఘట్టంతో పులకించిపోయిన ఉత్తరాంధ్ర రైతులు, ప్రజలు.. తమ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి, ఈ అపూర్వ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. బుధవారం పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర భూముల్లోకి అడుగుపెట్టిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న పవిత్ర జలాలను శిరస్సున చల్లుకుని, భావోద్వేగంతో కాలువలో నిల్చుని పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి తన ప్రణామం అర్పించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు.


ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది: సీఎం

అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలతో కళకళలాడతాయి. అన్నవరం సత్యదేవుడి ఆశీస్సులతో అనకాపల్లికి వచ్చిన గోదారమ్మను.. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు, ఆపై అరసవల్లి సూరీడి పాదాల వద్దకు తీసుకెళ్లి, వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నీటితో విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీలు తరలించనున్నట్టు వివరించారు. "2019లో వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసింది. డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసింది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాప విముక్తి కలిగించారు" అని చంద్రబాబు విమర్శించారు. ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం ఉన్నాయని కొనియాడారు. అభివృద్ధికి చిరునామాగా ఉత్తరాంధ్ర గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లేవారు. ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి కల్పిస్తాం. విశాఖ ఏఐ పట్నంగా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా మారుతుంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఈ ప్రాంతం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లకు నీటి కొరత వస్తుందన్నది తప్పుడు ప్రచారమని, వాటికి అవసరమైన 5 టీఎంసీల కంటే ఎడమ కాలువ ద్వారా ఎన్నో రెట్ల నీరు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సభా వేదిక నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం, ప్రాజెక్టు కోసం కృషి చేసిన ఇంజినీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

















## వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ రణభేరి

**భువనగిరి సెప్టెంబర్ 2 మహా న్యూస్:** కాంగ్రెస్ 1000 రోజుల పాలన పైన BRS రణభేరి లో BRS భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల వైఫల్య పాలనపై భువనగిరి నియోజకవర్గ కేంద్రంలో BRS పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ. నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 మోసపూరిత హామీలతో రూపొందించిన 420 మీటర్ల ఫ్లెక్సీ తో వినూత్న రీతిలో ర్యాలీ చేసి, కాంగ్రెస్ బాకీ కార్డ్ లను పంపిణీ చేశారు భువనగిరి గాంధీ విగ్రహం నుండి మొదలైన ర్యాలీ ఆఫీస్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా బాబు జగ్జీవన్ చౌరస్తా వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి మాట్లాడుతూ. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది అన్నారు.రేవంత్ రెడ్డి చరిత్రలో చెత్త సీఎంగా మిగిలిపోతాడనీ వారు హెచ్చరించారు కేసీఆర్ కాలి గోటికీ కూడా సరిపోని రేవంత్ రెడ్డి అడ్డగోలిగా మాట్లాడుతున్నాడు. అని వారు విమర్శించారు 420 హామీలతో గద్దె నెక్కిన పక్క 420 పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదనీ వారు అన్నారు సాగర్ నీళ్లు ఆంధ్రోళ్లు దోచుకొని పోతుంటే నోరు మెదపని దద్దమ్మ సీఎం రేవంత్ రెడ్డి. అని వారి మండిపడ్డారు నీళ్ల దొంగ చంద్రబాబు, రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందంలో భాగంగానే సాగర్ నీళ్లు దోచుకొని పోతున్నారు.ఆంధ్రకు తరలిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు మన రైతులను ఎండబెట్టి ఆంధ్రోళ్లకు చద్ది కడుతున్న నిచపు సీఎం రేవంత్ రెడ్డి. పై వారు మండిపడ్డారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేస్తోందనీ అన్నారు రేవంత్ రెడ్డి అన్నదమ్ములకు, కుటుంబానికి ఏ పదవులో ఉన్నారని వారికి సెక్యూరిటీ ఇస్తున్నారు. ఏ హోదాలో ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవడం కోసం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాల అని అన్నారు ఈ కార్యక్రమంలో BRS పార్టీ మండల పార్టీ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు,శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్ల, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, BRS విద్యార్థి, యువజన, BRS పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు ప్రతి ఒక్కరు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## క్యాంప్ ఆఫీస్‌పై బీజేపీ దాడి హేయమైన చర్య

- **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**భువనగిరి, మహా న్యూస్** : భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటనను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బుధవారం భువనగిరి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేయడం హేయమైన చర్య. అని మండిపడ్డారు ఇది రాజకీయం కాదన్నారు ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. ఆయన హెచ్చరించారు ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేయాలని, ప్రత్యర్థులపై నిర్మాణాత్మక విమర్శలు చేయాలి తప్ప దాడులు, హింసకు పాల్పడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదని అన్నారు. మారణాయుధాలతో క్యాంప్ కార్యాలయంపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా వేదిక అని, భువనగిరిలో ఇలాంటి దాడుల సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు. బీజేపీపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు ఢిల్లీ నుంచి అమిత్ షా డైరెక్షన్‌లో బండి సంజయ్ మరియు బీజేపీ నాయకులు గుండా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఇన్ని రోజులు మేము సంయమనం పాటించాం. మా ఓపికను బలహీనతగా భావించొద్దు. హద్దులు దాటితే ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే గట్టిగా సమాధానం చెబుతాంఅని హెచ్చరించారు. ఇటీవల నల్గొండలో మంత్రి ఇంటిపై జరిగిన దాడిని కూడా ప్రస్తావిస్తూ, బీజేపీ హింసాత్మక రాజకీయాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. చెప్పేది రాముడి పేరు.. చేసేది రావణకాండ అన్న రీతిలో బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. మంగళవారం జరిగిన ఘటన అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించారని, బుధవారం క్యాంప్ కార్యాలయాన్ని గోపంచకంతో శుద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హింసకు ఎప్పటికీ తలొగ్గదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు బీఆర్ఎస్‌పై కూడా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణలో 1000 రోజుల దగా అంటూ బీఆర్ఎస్ మరో కొత్త రాజకీయ నాటకానికి తెరతీసిందని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే అబద్ధాలు, అసత్య ప్రచారాలను మానుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన వైఫల్యాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని, ప్రజా సమస్యలపై చర్చించకుండా రాజకీయ నాటకాలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ ఒక్కరోజు కూడా అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజా సమస్యలకు దూరంగా ఉండటం సరికాదని విమర్శించారు. ప్రజల కోసం పని చేయని కేసీఆర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధాలకు అడ్రస్ అంటేనే బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్మాణాత్మక విమర్శలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే హింస, దాడులు, బెదిరింపులను మాత్రం సహించేది లేదని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పట్టణ కౌన్సిలర్లు, pacs చైర్మన్లు, డైరెక్టర్స్,పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, డీసీసీ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో రెండవ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎంపీడీవో జీ మున్ని ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభు సాగర్, డీఎల్పీవో సతీష్ రెడ్డి, ఎంపీవో రమేష్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

- **పాలకుర్తిలో ఘనంగా మాజీ సీఎం వైఎస్ఆర్ వర్ధంతి**



**పాలకుర్తి , మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలంలో దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ఆర్ పాలన ప్రజా సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేద విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యతనిస్తూ సాగిందన్నారు. ప్రతిపక్ష నాయకులు సైతం ఆయన పరిపాలనను మెచ్చుకునే స్థాయిలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత వైఎస్ఆర్‌కే దక్కుతుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యకు బాటలు వేశారని తెలిపారు. అలాగే జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ రైతుల పొలాలకు నీరు అందించేందుకు కృషి చేసిన రైతు పక్షపాతి వైఎస్ఆర్ అని కొనియాడారు.వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజా అనుకూల నిర్ణయాలు నేటికీ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని నాయకులు పేర్కొన్నారు. పేదలు, రైతులు, విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఆయన పాలన ప్రధాన లక్ష్యంగా ఉండేదన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గడ్డం తిరుపతి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, మాజీ ఎంపీపీ గంగాధర రమేష్, పాలకుర్తి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్, ఎర్రం స్వామి, తలారి శంకర్, చిలగాని రాజేశం, మండల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జీవితం నుండే కథలు పురుడు పోసుకుంటాయి

- **గ్రంథాలయాలలో బాల సాహిత్యాన్ని చదవాలి**
- **కథా రచనలపై సృజనాత్మక కార్యశాలలో ప్రసిద్ధ కవి నాగవర్మ ముత్యం**

**లక్షెట్టిపేట /మంచిర్యాల, మహా :** మానవుల జీవితం నుండే కథలు పురుడు పోసుకుంటాయని విషయనిపులు ప్రసిద్ధ కవి నాగవర్మ ముత్యం వాక్యానించారు. బుధవారం లక్షెట్టిపేట తెలంగాణ సాహిత్య పరిషత్తు శాంతా వసంతా ట్రస్టు సౌజన్యంతో పిఎంశ్రీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు కథలు రాయడం ఎలా అనే అంశంపై కథా రచనలపై సృజనాత్మక కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం మనం అనుభవిస్తున్న జీవితం నుండే కథలు పురుడు పోసుకుంటాయని, అనుకోని సంఘటనలు కథలో ఉంటాయని వెల్లడించారు. ప్రారంభం,ఎత్తుగడ, పాత్రోచి సంభాషణలు తదితర అంశాలను వివరించారు. పాఠశాల గ్రంథాలయలోని బాల సాహిత్యాన్ని రోజు చదవాలని కోరారు. ఇప్పటి నుండే కథల రచనల పట్ల ఆసక్తిని పెంచుకోవడం ద్వారా సమాజంలోని అసమానతల జీవితాలను పరిశీలన చేసి అక్షరీకరణ చేయాలన్నారు. ఈ సందర్భంగా సృజనాత్మకాంశాలను వివరించే ' రచనా కళ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా పాఠశాల ప్రిన్సిపాల్ కాటూరి రామ కల్యాణి, ముఖ్యఅతిథిగా ప్రసిద్ధ సాహితీ వేత్త కొండు జనార్ధన్, సమన్వయకర్తగా ప్రసిద్ధ రచయిత గోపగాని రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు ఎన్. సరస్వతి, ఎం. సుజాత, కె.సంధ్య, కె.వసంత పాల్గొన్నారు.



## బసంత్‌నగర్ టోల్‌గేట్ వద్ద వైఎస్సార్ వర్ధంతి

**పాలకుర్తి, మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం బసంత్‌నగర్ టోల్‌గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు మరియు రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య మరియు మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధర్ రమేష్, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు పర్శవేణి శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం...

- **ఎఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి**
- **వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 2 మహా:** పేద ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన, దివంగత మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వర్ధంతి సందర్భంగా, బుధవారం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న ఆయన విగ్రహానికి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆరోగ్యం, విద్య, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనందరి బాధ్యత అని, ఇబ్రహీంపట్నం ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావణమోని లింగం, మున్సిపాలిటీ అధ్యక్షులు ఎండి గౌస్ పాషా, మున్సిపల్ కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, ఇందూరి శ్రీనివాస్, వర్త్య రామదాసు, ఏఎంసీ డైరెక్టర్ దొంతరమోని రాజు, పార్టీ నాయకులు పెదగారి శ్రీకాంత్, సొప్పరి రవి, కిషన్, దుబ్బాక లింగం తదితరులు పాల్గొన్నారు.



## తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి-కలెక్టర్

- **ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పై సమీక్షా సమావేశం**
- **హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు**



**ఆదిలాబాద్ మహా:** జిల్లాలో పారదర్శకమైన, తప్పులులేని ఓటర్ల జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పై ఆయన సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం నోమ్యాపింగ్, వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో నోటీసులు జారీ చేసి ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విచారణకు ఓటరే స్వయంగా హాజరు కావాల్సిన తప్పనిసరి నిబంధన లేదని, వారు రాలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు లేదా బంధువులు సైతం హాజరు కావచ్చని స్పష్టం చేశారు. విచారణకు వచ్చేవారు ఈసీ సూచించిన గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదాని ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. నిర్దేశిత తేదీల్లో విచారణకు హాజరు కాలేకపోయిన వారికి తదుపరి ఏడు రోజుల వ్యవధిలో విచారణకు హాజరయ్యే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు. అలాగే, 2026 అక్టోబరు 1 నాటికి అర్హత సాధించేవారు, జాబితాలో పేర్లు లేనివారు లేదా తప్పుల సవరణ కోరే వారి కోసం సెప్టెంబరు 5, 6, 12, 13 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. కొత్తగా పేరు నమోదుకు ఫారం6, మార్పులుచేర్పులు లేదా అభ్యంతరాలకు ఫారం8తో పాటు డిక్లరేషన్ ఫారమ్‌లను పూర్తి చేసి ఆయా పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత, ట్రాఫిక్ సమస్యల పై క్షేత్రస్థాయిలో పరిశీలన

- **బస్టాండ్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్,చౌరస్తా మహా** : ఇటీవల జరిగిన రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ బుధవారం సంబంధిత శాఖల, క్షేత్రస్థాయి అధికారులతో కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణం లో పనులను, రోడ్డులో ఏర్పాటు తున్నా నీటి నిలువలు, గుంతలు వలన ట్రాఫిక్ జామ్, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే లక్ష్మీపురం మార్కెట్ పరిధిలోని రహదారుల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మార్కెట్ పరిధికి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వానకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలను, నీటి నిలువలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకుని, నిర్ణీత ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట కుడా సీపీఓ అజిత్ రెడ్డి ఎడి సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో వరంగల్ సుమ, ఆర్ అండ్ బి ఈఈ రాజేందర్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం..!

- **3 ఏళ్ల అద్దె బకాయిలపై ఇంటి యజమాని నిరసన**
- **బకాయి చెల్లించి నాకే కార్యాలయం తరలించాలని డిమాండ్.**




**వేములవాడ, మహా**: వేములవాడ పట్టణం లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేయ డంతో బుధవారం ఉద్రిక్తత నెలకొన్న ఘటన వేములవాడ పట్టణంలో చోటు చేసుకుంది. వేములవాడ పట్టణంలోని ఓల్డ్ అర్బన్ కాలనీలో గత 17 సంవత్సరాలుగా అద్దె భవనంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఉంది. ప్రభుత్వ నూతన ఆదేశానుసారం కార్యాలయం నేడు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో యజమాని తన భవనానికిమూడేళ్లుగా కార్యాలయా నికి సంబంధించిన 60 వేలు అద్దె బకాయి లతో పాటు రూ. 2 లక్షల కరెంట్ బిల్లు చెల్లించలేదని భవన యజమాని ఆరోపిస్తున్నారు. బకాయిలు చెల్లించకుండానే ఈ నెల 3వ తేదీన కార్యాలయాన్ని మార్కెట్ యార్డుకు తరలించేందుకు అధికారులు సిద్ధమవు తుండటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.తక్షణమే తమకు రావాల్సిన అద్దె,విద్యుత్ బకాయిలను చెల్లించిన తర్వాతే కార్యాల యాన్ని ఖాళీ చేయాలని డి మాండ్ చేస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింబకాయలు ఎవరు చెల్లిస్తారని ఇప్పుడు చెల్లిస్తారని వాపోయాడు. బకాయిలు చెల్లించి నాకే కార్యాలయాన్ని తరలించాలని డిమాండ్ చేశారు.పాత కార్యాలయానికి ఇన్ని వేల బకాయిలు ఉంటే మరి కొత్త కార్యాలయంలో పనులు సజావుగా సాగేనా అని పట్టణవాసులు గుసగుసలాడుతున్నారు...

## వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి



**మొయినాబాద్ మహా:** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని మొయినాబాద్ మండలంలోని జేబీఐటీ -అమ్డాపూర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొలిగిద్ద సత్యనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు. సాగు నీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడని ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ గారి సేవలను స్మరించుకుంటు దివంగత నేత వైఎస్సార్ కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ మండల అధ్యక్షుడు తమ్మలి మానయ్య, నాయకులు మాడి వెంకట్ రెడ్డి, చేగూరి రామకృష్ణగౌడ్, బాలకృష్ణారెడ్డి కీసర సంజీవ రెడ్డి, గడ్డం వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు




# అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తుడు అరెస్ట్

- మొబైల్ స్పేర్ పార్ట్స్ పేరుతో ఆన్ లైన్ మోసాలు
- దేశవ్యాప్తంగా 5 కోట్లకు పైగా మోసం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ మహా** : ఇన్‌స్టాగ్రామ్‌లో మొబైల్ స్పేర్ పార్ట్స్, యాక్సెసరీస్ విక్రయాల పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని అరెస్ట్ చేసినట్టు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. రాజస్థాన్ కు చెందిన నిందితుడు ప్రకాశ్ కుమార్ దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలలో సుమారు 140 మంది బాధితులను మోసం చేసి 5 కోట్ల30 లక్షలకు పైగా మోసానికి పాల్పడినట్టు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు..ఇచ్చోడకు చెందిన బాధితుడు సమీర్ సయ్యద్ గత జూలై 25న బాధితుడు మొబైల్ యాక్సెసరీస్ కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో వెతికాడు. అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా, మొబైల్ స్పేర్ పార్ట్స్, యాక్సెసరీస్ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాలని కొరియర్ ద్వారా సరుకులు పంపిస్తామని నిందితులు నమ్మించారు. బాధితుడు పలు విడతల్లో వారు సూచించిన QR కోడ్ కు మొత్తం 2 లక్షల 18వేలు ఆన్‌లైన్‌లో చెల్లించాడు. అనంతరం నిందితులు వాట్సాప్ ద్వారా కొరియర్ రసీదును పంపించి, మజీసా ఎయిర్ ఎక్స్‌ప్రెస్ ద్వారా సరుకులు అందుతాయని తెలిపారు. ఇచ్చోడ, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఆ పేరుతో ఎలాంటి కార్యాలయం లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేసారు.బాధితుడి ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోందన్నారు. సోషల్ మీడియా వేదికల్లో తక్కువ ధరలకు వస్తువులు అందిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి ముందుగా డబ్బులు చెల్లించవద్దని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే సమయంలో విక్రేత వివరాలను పూర్తిగా పరిశీలించి, అనుమానాస్పద లింకులు, QR కోడ్లు లేదా వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు పంపకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడ ఎస్హెచ్ఓ ఇన్స్పెక్టర్ కే. నరేష్ కుమార్, సైబర్ క్రైమ్ ఎస్ఐ గోపీకృష్ణ, సిబ్బంది మాజిద్, త్రిశూల్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక విచారణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- అక్టోబర్ 18 వరకు కొనసాగనున్న విచారణ ప్రక్రియ
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, మహా**: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కానీ, అనామలీస్ జాబితాలో ఉన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లకు సంబంధించిన అభ్యంతరాలు, నోటీసుల పై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లోని పోలింగ్ కేంద్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఏఈఆర్ఓ విచారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ సందర్శించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 50 విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల లోనే ఐదు, ఆరు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన విచారణలను నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లను విచారణకు హాజరుకావాలని సూచించారు. నోటీసులు అందుకున్నవారు ఎన్నికల సంఘం సూచించిన విధంగా సంబంధిత ధ్రువపత్రాలతో విచారణ కేంద్రాలకు హాజరై ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. విచారణకు హాజరైన "నో" మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ప్రతి ఓటరు సమర్పించిన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు, హాజరు రిజిస్టర్‌లో సంతకం తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోజువారీగా వచ్చిన దరఖాస్తులు, విచారణలను అదే రోజు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విచారణ ప్రక్రియలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు సమన్వయంతో పనిచేస్తూ షెడ్యూల్ ప్రకారం నోటీసులు సర్వ్ చేయడం, ఓటర్ల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించడం, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వంటి ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు.అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా తుది ఓటర్ల ముసాయిదా జాబితాలో చోటు కోల్పోకుండా అవసరమైన పత్రాలను సమర్పించేలా ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడం, అర్హులైన వారు తమ ధ్రువపత్రాలతో విచారణకు హాజరయ్యేలా సహకరించడం ద్వారా తుది ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా రూపొందించేందుకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఈఆర్వో, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హనుమకొండ ఏఈఆర్ఓ, తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమ పథకాలు అమలు

**వలిగొండ సెప్టెంబర్ 2 మహా న్యూస్** : వలిగొండ మండలంలోని మల్లెపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.40 లక్షల నిధులతో నిర్మించిన డ్రైన్ రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు పనులు పూర్తికావడంతో వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అదేవిధంగా రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో AMC చైర్మన్ భీమా నాయక్,PACS చైర్మన్ గరిసే రవి, స్థానిక సర్పంచ్ కుంభం వెంకటపాపి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, ఉప సర్పంచ్ మలుగ మాధవి-వెంకటేష్, pacs వైస్ చైర్మన్, డైరెక్టర్స్, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శిరీష హత్యకారకుని ఎన్కౌంటర్ చేయాలి.! సిపిఎం

- నిర్భయ దిశ చట్టం లాగానే శిరీష చట్టం చేయాలి
- శిరీష కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి
- ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ముందు నిరసన




**తుక్కుగూడ సెప్టెంబర్ 2 మహా**: శిరీష హత్య కేసులో సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరిపించి, నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం శిరీష చిత్రపటానికి కులమాలవేసి నివాళులర్పించారు. బుధవారం మహేశ్వరం మండలం తుక్కుగూడలోని త్రయంకేర్ హాస్పిటల్ లో జరిగిన, నర్సు శిరీష హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ప్రైమ్ కేర్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ముందు సీపీయం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం) మహేశ్వరం మండల కార్యదర్శి, ఏర్పుల శేఖర్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రామచందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్ హాజరై మాట్లాడుతూ... ప్రైవేట్ హాస్పిటల్లో ప్రజలకు సేవలందిస్తూ నర్సుగా విధులు నిర్వహిస్తున్న యువతి శిరీష దారుణ హత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందన్నారు. మహిళలు, యువతులు, ఉద్యోగినులు స్వేచ్ఛగా, భద్రంగా జీవించే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రైమ్ కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. నిర్భయ, దిశ చట్టం లాగానే శిరీష చట్టం కూడా చేయాలన్నారు. కేసును త్వరితగతిన విచారించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**మహిళల భద్రత కోసం పోలీసు గస్తీ....**

తుక్కుగూడ, మహేశ్వరం పరిసర ప్రాంతాల్లో మహిళల భద్రత కోసం పోలీసు గస్తీ పెంచడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాత్రివేళ విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కేసును త్వరితగతిన విచారించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి. శిరీష కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే తగిన ఆర్థిక సహాయం అందించి, కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. మహిళలపై హింసను అరికట్టడంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మునిగని ప్రశాంత్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోదాసు నరసింహ, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.



# పట్టణంలో శబ్ద కాలుష్యంపై మందమర్రి స్సై కోరడ

- 4 వాహనాలు స్వాధీనం
- యువతకు కౌన్సిలింగ్

**మందమర్రి, మహా** : పట్టణంలో శబ్ద కాలుష్యంపై పట్టణంలో శబ్ద కాలుష్యంపై మందమర్రి ఎస్సై గోపతి నరేష్ బుధవారం కొరడా ఝులిపించారు. మందమర్రి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సైలెన్సర్లను మోడిఫై చేసి, తీవ్రమైన శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తూ ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నవాహనాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా శబ్దాలు చేస్తూ ప్రయాణిస్తున్న 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేష్ వెల్లడించారు.ఆయా వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తక్షణమే తొలగించి, సంబంధిత వాహనదారులు యువతకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తొలగించి లేదా సైలెన్సర్లను మోడిఫై చేసి అధిక శబ్దాలు చేస్తూ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు.ఈ శబ్ద కాలుష్యం వల్ల వృద్ధులు, చిన్న పిల్లలు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. ఎవరైనా రూల్స్ అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని ఎస్సై పేర్కొన్నారు.




# బాలికల హాస్టల్ ను తనిఖీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్

- విద్యార్థినీలతో కలిసి భోజనం
- రుచి శుచి పరిశీలన

**ఆదిలాబాద్ మహా:** విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని 49వ వార్డు భుక్తాపూర్ లో గల ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లోని విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, వారికి అందుతున్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా హాస్టల్ వంటశాలను పరిశీలించిన చైర్‌పర్సన్ విద్యార్థినులకు అందిస్తున్న అన్నం, పప్పు, చికెన్, వెజిటబుల్ కర్రీ, పెరుగు తదితర ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం హాస్టల్‌లో నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాల్లో పాల్గొని, విద్యార్థినులతో కలిసి కొద్దిసేపు నృత్యం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థినులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వారం ఒకటి రెండు హాస్టళ్లను ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులకు అందుతున్న బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ నాణ్యతను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత , వార్డెన్ సుగుణ,సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల ప్రజాపాలన సంబరాలు

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 2 మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు నిర్వహించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో మండలాలు, మున్సిపాలిటీలు, డివిజన్లలో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను కోరారు.



## పేదల పెన్నిధి... బడుగు బలహీన వర్గాల

# ఆశాజ్యోతి డాక్టర్ వైయస్సార్

- ఆరోగ్యశ్రీ ప్రధాత... ఇందిరమ్మ గృహ నిర్మాణ విధాత
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్

**జవహర్ నగర్, మహా** : .పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డియే అని ఆరోగ్యశ్రీ ప్రధాత... ఇందిరమ్మ గృహ నిర్మాణ విధాత రాజశేఖర్ రెడ్డియే అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా బాలాజీ నగర్ లో గల వైయస్సార్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రైతులకు ఉచిత కరెంటును, వైద్య సేవలో భాగంగా 108 అంబులెన్స్ ను ఫీజు రియంబర్స్మెంట్, ఇందిరమ్మ ఇండ్లతో పాటు పేద ప్రజలందరికీ అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిన మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. రాజశేఖర్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు ఆలోచనలు అతను ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. సేవే దైవంగా ప్రేమే ధ్యేయంగా పేదవారికి ఆపన్న హస్తం అందించి వారి బాగోగులు పేదవారి సంక్షేమానికి నిరంతరం శ్రమించిన నాయకుడు దివంగత రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సదానంద్, అనంతలక్ష్మి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్ కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇడుపుల పాయలో ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకుడు

- వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలకు హాజరు
- కుటుంబ సభ్యులతో కలిసి నివాళ్లు

**ఆదిలాబాద్ మహా**: వైఎస్సార్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు.బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఇడుపులపాయలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఘాట్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి చూపిన అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు ఎప్పటికీ గుర్తుండేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక చారిత్రాత్మక నిర్ణయాలతో సంక్షేమ పథకాలు అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు.

# ఇది 1000 రోజుల ప్రభుత్వ పాలన కాదు.. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పీడన!

- మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 2 మహా:** ఇది 1000 రోజుల ప్రభుత్వ పాలన కాదు వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పీడనా అని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా, బుధవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు 420 అడుగుల, కాంగ్రెస్ 420 హామీల ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుమంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ధర్నా చేపట్టారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తా రోకో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన మోసాలను, ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అరాచకాలను ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పాటు స్థానిక ఎమ్మెల్యే కారణంగా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వివరించి, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. యాచారం మంచాల అబ్దుల్లాపూర్మెట్ మండలాలలో కాంగ్రెస్ మోసాల పట్ల పోరుబాట నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వలిగొండ, సెప్టెంబర్ 2, మహా న్యూస్:** రామన్నపేట 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ పనుల కారణంగా నేడు వలిగొండ, గోలెంపల్లి, రెడ్లరేపాక సబ్ స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ 11 కేవీ ఫీడర్లకు మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. వేములకొండ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జె. నర్సింహా తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## కల్వకుంట్ల కవిత పైన ఫేస్‌బుక్, ఇంస్టాగ్రామ్ వేదికగా అనుచిత వ్యాఖ్యలను

- **తీవ్రంగా ఖండిస్తున్నాం**
- **మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో టిఆర్ఎస్ పార్టీ నాయకుల ఫిర్యాదు**



**మొయినాబాద్ మహా:** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్రంలో రాజకీయ శక్తిగా ఎదుగుతున్న తరుణంలో మంగళవారం సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కే అనిల్ పైన బుధవారం నాడు మోయినాబాద్ పోలీస్ స్టేషన్ లో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కుమ్మరి శివశంకర్ ప్రజాపతి టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజక వర్గం ఇన్చార్జి బేగరి రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా తన బాధను వ్యక్తపరచవచ్చు కానీ కానిస్టేబుల్ గా కే అనిల్ అనే వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగుతున్నాడు ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా రక్షకబటులు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షులు కవిత పైన ఇలాంటి వాక్యాలు పునర్వతమైతే సహించేది లేదని అన్నారు నిధుల నుండి వెంటనే సస్పెండ్ చేయాలని చట్టపరమైన కేసులు నమోదు చేయాలని టిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు యండి అన్వార్ ఖాన్, మొయినాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేకగూడెం బిక్షపతి,టిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ మహమ్మద్ నూర్ భాయ్,ఎనుగు సంజీవ రెడ్డి కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, బొక్క సురేందర్ రెడ్డి, చాకలి విక్రమ్,మాలని రాజు, యండి యూనిస్, సల్ల ఆంజనేయులు ముదిరాజ్, అబిలాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## పల్లె ప్యారడైజ్ కాలనీకి నూతన కార్యవర్గం

**కుషాయిగూడ, మహా :** పల్లె ప్యారడైజ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్వసభ్య సమావేశంలో కాలనీ వాసుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఆర్. నరసింహారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పీ. లక్ష్మీ రజని, ప్రధాన కార్యదర్శిగా కే. శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా కే. శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టీ. రామారావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చె. శ్రీకాంత్ గుప్తా, వై. రవీందర్‌రెడ్డి, పీ. రమణమూర్తి, ఎన్. గోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసుల ఐక్యత, సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం, రహదారులు, మురుగునీటి కాలువలు, వీధిదీపాలు, పార్కుల అభివృద్ధి, భద్రతతో పాటు మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కాలనీవాసుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై సంఘం మాజీ అధ్యక్షుడు ధన్‌సాగర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేసి, నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను నిండా ముంచింది

- **ఢిల్లీ ప్రయాణానికి డబ్బులు ఉంటాయి. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కు డబ్బులు లేవా.**
- **1000 రోజుల ప్రజాపాలన పూర్తిగా విఫలమైంది.**
- **బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి**

**రాజేంద్రనగర్ మహా :** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితి పార్టీ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కొత్వాల్ గూడ డివిజన్ అధ్యక్షులు,కోన్నమొల్ల శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ సర్కిల్ బస్టాండ్ ఎదురుగా బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 వాగ్దానాలు, 13 డిక్లరేషన్లను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఢిల్లీకి తిరగడానికి డబ్బులు ఉన్నాయి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, పేదింటి ఆడపిల్లల కు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్నారు. ఎంతమందికి తులం బంగారం ఇచ్చారు. స్కూటీలు ఎవరికి ఇచ్చారు. మహిళలకు 2,500 రూపాయలు ఇచ్చారా. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దొంగ హామీలుగా మిగిలిపోయాన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 1000 రోజుల్లో ప్రజలను కేవలం మాయమాటలతో వంచించిందని, రైతు భరోసా, వ్యవసాయ కూలీల సాయం ఎగ్గొట్టిందని బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా ఆందోళనలు చేపడుతుందన్నారు.ప్రకాష్ గౌడ్ మా పార్టీ మనిషిరాష్ట్ర ప్రజలనే కాదు, మా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నియోజకవర్గ ప్రజలను కూడా మాయమాటలతో నిండా ఉంచారు. ఎన్నో వాగ్దానాలు చేశారు, ప్రజలను ఏమార్చుడు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు 18 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. 100 పడకల ఆస్పత్రి, మార్చరి రూమ్, బహదూర్ గూడా, గన్సిమియా గుడా, మదన్ పల్లి, కోత్వాల్ గూడ, రైతులకు పట్టా పాస్ బుక్కులు, ఇప్పిస్తానన్న హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయి. కార్యక్రమంలో ఎనుగు మురలీధర్ రెడ్డి, చెక్కల ఎల్లయ్య, దీపా మల్లేష్,జయసింహ, మంచర్ల శ్రీనివాస్, మల్లేష్ ముదిరాజ్, హహనుమంతు, రాజేందర్, పరంధాములు, మురళి గౌడ్, సాగర్,రమేష్, కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, రఘు యాదవ్, రాము, చక్రధర్ రెడ్డి, కుమార్, రాజేష్ యాదవ్,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.!

- **జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి**
- **జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి, బుధవారం కొందుర్గ్, చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, సిబ్బంది విధుల నిర్వహణ, మందుల నిల్వలు, ల్యాబొరేటరీ సేవలు, ప్రసవ సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు...**

డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె సూచించారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రిలో పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి సూచించారు.

## దొంగనోట్లు తయారు చేసి చెలామణి చేస్తున్న ముఠా అరెస్ట్...



**రాజేంద్రనగర్ మహా :** ఎస్ రావు అడిషనల్ డీసీపీ , టాస్క్ ఫోర్స్ హైదరాబాద్, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కార్యాలయంలో దొంగ నోట్లు తయారుచేసి చెలామణి చేస్తున్న ముఠా వివరాలను అయిన వెల్లడించారు.ఇన్ స్టా గ్రామ్ రీల్స్ చూసి దొంగనోట్లు తయారు చేసి చెలామణి చేస్తున్న ముఠాను శంషాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు రమావత్ రాము , రమావత్ మోతిలాల్ , రమావత్ గాంధీ , సుధీర్ లు కలిసి ఈజీ గా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో దొంగనోట్ల తయారీకి పూనుకున్నారు. అయితే ఇన్ స్టా గ్రామ్ రీల్స్ చూసి అచ్చం ఒరిజినల్ నోట్ల మాదిరిగానే 500,200,100,ఫేక్ కరెన్సీ తయారు చేశారు. 500,200,100 రూపాయల నోట్లను తయారు చేసి రాత్రి సమయాల్లో మద్యం దుకాణాలు , పాన్ డబ్బాల వద్ద చెలామణి చేసేవారు. ఈ క్రమంలో నకిలీ నోట్లు చలామణి అవుతున్నాయని సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి 2,91,100 రూపాయల నకిలీ కరెన్సీతో పాటు కలర్ ప్రింటర్ , లామినేటర్ , ఇంకు డబ్బాలు , నోట్ల తయారీకి కావాల్సిన ముడిసరుకులను సీజ్ చేశారు. ఒకరు పరారీలో ఉండగా ముగ్గురు నిందితులను రిమాండ్ కి తరలించారు. ఇన్ స్టా గ్రామ్ లో రీల్స్ చేసిన వారిపై సైతం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## సదరం సర్టిఫికెట్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి

**జవహర్ నగర్, మహా:** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో దివ్యాంగుల సదరం ధ్రువపత్రాల పునరుద్ధరణ, కొత్త దరఖాస్తుల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరుతూ కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ డిప్యూటీ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆసరా పింఛన్‌పై ఆధారపడుతున్న పేద, అర్హులైన దివ్యాంగులకు గడువులోగా సదరం ధ్రువపత్రం పొందడంతోపాటు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లాలో సదరం ధ్రువపత్రాలు లేని అర్హులు, పునరుద్ధరణ అవసరమైన లబ్ధిదారులు అనేక మంది ఉన్నారని తెలిపారు.వారి కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ, స్లాట్ బుకింగ్, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 15లోపు ఆసరా పింఛన్‌కు దరఖాస్తు చేసుకుని, సదరం స్లాట్‌ను త్వరగా బుక్ చేసుకోవాలని సూచించారు. తలసేమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా, డయాలసిస్ చేయించుకుంటున్నవారు ఆసరా పింఛన్‌కు అర్హులని పేర్కొన్నారు. మీ సేవ కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దివ్యాంగులకు సహకారం అందించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిప్యూటీ కలెక్టర్ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు సహకారం.. మాజీ సబ్ రిజిస్టర్ అరెస్టు

- **నకిలీ పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకారం**
- **కీసర మాజీ సబ్‌రిజిస్ట్రార్ అరెస్టు చేసిన పోలీసులు.**




**కుషాయిగూడ, మహా:** నకిలీ స్థిరాస్తి పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకరించడంతో పాటు పలు స్థిరాస్తి మోసం కేసుల్లో కీలకంగా వ్యవహరించిన కీసర మాజీ సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ యూసుఫ్ ఉర్ రహ్మాన్‌ను కీసర పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఏడు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబరు 1న సాయంత్రం అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

**రూ.4.11 కోట్ల రుణాల మోసం**

క్రైం నంబరు 928/2025 దర్యాప్తులో నకిలీ, తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాలను సృష్టించి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తుల పేర్లపై గృహ రుణాలు పొందిన వ్యవస్థీకృత మోసం వెలుగుచూసింది. ఇప్పటివరకు 11 గృహ రుణ లావాదేవీల ద్వారా సుమారు రూ.4.11 కోట్లు మోసపూరితంగా పొందినట్లు పోలీసులు గుర్తించారు.

**పత్రాలే ఆధారంగా రుణాలు**

కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన పలు అనుమానాస్పద విక్రయ పత్రాలను నిందితులు అనంతరం బ్యాంకులు, గృహ రుణ సంస్థల్లో హామీ పత్రాలుగా ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. నకిలీ లింకు పత్రాలు, సాధారణ అధికార పత్రాలు, వ్యక్తుల గుర్తింపు తారుమారు తదితర మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**రుణం తీసుకుని ఎగవేత**

మొదట కొంతకాలం వాయిదాలు చెల్లించి బ్యాంకులకు అనుమానం రాకుండా వ్యవహరించి, అనంతరం ఉద్దేశపూర్వకంగా వాయిదాలు నిలిపివేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. బ్యాంకులు నోటీసులు జారీ చేసిన తర్వాత ఆస్తులను పరిశీలించగా కొన్ని ఆస్తులు ఉనికిలో లేకపోవడం, సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు, లింకు పత్రాల్లో తారుమార్లు చేసినట్లు బయటపడింది.

**కొనసాగుతున్న దర్యాప్తు**

కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని అసలు రిజిస్ట్రేషన్ రికార్డులు, వేలిముద్రలు, జీవ గుర్తింపు వివరాలు, బ్యాంకు రుణ పత్రాలు, ఆర్థిక లావాదేవీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను



గుర్తించి అరెస్టు చేయడంతో పాటు మోసపూరితంగా పొందిన నగదు, ఆస్తుల వివరాలను వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ధర్నా

- **గాడిదలతో నిరసన. మాట తప్పిన సర్కార్ కు చరమగీతం పాడాలి**
- **ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**




**కుషాయిగూడ, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో వైఫల్యాలు, అమలుకాని హామీలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నిరసనలో పాల్గొన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు గాడిదలతో నిరసన చేపట్టడంతోపాటు 420 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఎమ్మెల్యే. బండారు లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.హామీలను తక్షణమే అమలు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని, హామీలు అమలయ్యే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాకీ కార్డుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, పన్నాల దేవేందర్ రెడ్డి . సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి. సాయి జన్ శేకర్ . గొల్లూరి అంజయ్య. జేరిపోతుల ప్రభుదాస్. గుండారపు శ్రీనివాస్ రెడ్డి.మాజీ డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, బోధస్ లక్ష్మీనారాయణ. వంజరి ప్రవీణ్ కరిపే. కా సం మైపాల్ రెడ్డి. ఆలేటి మహిపాల్ రెడ్డి. నేమోరీ మహేష్‌గౌడ్ బుచ్చన్నగారి శ్రీకాంత్ రెడ్డి సప్పిడి శ్రీనివాస్ రెడ్డి. షేర్ మనమ్మ.మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 420 హామీలపై బీఆర్ఎస్ నిరసన

- **అడ్డుకునేందుకు కాంగ్రెస్ యత్నం**




**జవహర్‌నగర్, మహా :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలును ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమం జవహర్‌నగర్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. హామీలను గుర్తు చేస్తూ 420 మీటర్ల బాకీ కార్డులను ప్రదర్శించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.. వాటిని ప్రజలకు అందజేస్తూ నిరసన తెలిపారు.ప్రజలకు బాకీ కార్డులు అందజేస్తుండగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. బాకీ కార్డులను చించివేయడంతో పాటు తమ కార్యకర్తలతో దురుసుగా ప్రవర్తించి కార్యక్రమానికి ఆటంకం కలిగించారని మండిపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ బీఆర్ఎస్ శ్రేణులు వెనక్కి తగ్గకుండా బాకీ కార్డులను ప్రజలకు అందజేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. పోలీసుల తీరుపైనా బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ మేయర్ మేకల కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకోవడం సరికాదన్నారు. అధికార పార్టీ నాయకులు దౌర్జన్యానికి దిగడం, పోలీసులు తమ కార్యకర్తలపై వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా 420 హామీలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ సైతం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- **మొయినాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేతల భారీ నిరసన ర్యాలీ**

**మొయినాబాద్ మహా:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మొయినాబాద్ చౌరస్తాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి మండలంలో ఆరు గ్యారెంటీల అమలుపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మొయినాబాద్ మండలంలో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొయినాబాద్ చౌరస్తా నుండి సమీపం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ నిరసన ర్యాలీ మొయినాబాద్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ధారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది మొయినాబాద్ మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దారెడ్డి వెంకట్ రెడ్డి మరియు రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజలకు ఏకంగా 420 హామీలు ఇచ్చారు కానీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా సరిగ్గా నెరవేర్చలేదు హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు నేడు అష్టకష్టాలు పడుతున్నారు ప్రజల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అరిచేతిలో స్వర్గం చూపించి ఓట్లు దండుకోవడం మాత్రమే కాకుండా ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు మా ఉద్యమ పోరాటం ఆగదు. ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుంది అని వెంకట్ రెడ్డి మరియు రాష్ట్ర నాయకులు కొంపల్లి నంతరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితురులు పాల్గొన్నారు.

## మల్లేపల్లి ఓసీలో కేబుల్ చోరీకి బ్రేక్

**మణుగూరు, మహా:** సింగరేణి మణుగూరు ఏరియాలోని మల్లేపల్లి ఓసీలో కేబుల్ చోరీకి పాల్పడిన వ్యక్తులపై సెక్యూరిటీ విభాగం చర్యలు చేపట్టింది. సెక్యూరిటీ స్పెషల్, ఇంటెలిజెన్స్ టీంలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో చోరీకి గురైన 50 మీటర్ల 35 ఎస్క్యూఎంఎం ఆర్మర్డ్ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి 9.25 గంటల సమయంలో డంపర్ షెడ్ నుంచి కేబుల్ చోరీకి గురైనట్లు సమాచారం అందడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ బందెల విజేందర్ నేతృత్వంలో బృందాలు రంగంలోకి దిగి గాలింపు చేపట్టాయి. మల్లేపల్లి చెరువు కట్ట సమీపంలో కొందరు కేబుల్‌ను ఒలుస్తున్నట్లు గుర్తించి అక్కడికి చేరుకోగా, సెక్యూరిటీ సిబ్బందిని గమనించిన వ్యక్తులు పరారయ్యారు. ఘటనా స్థలంలో కేబుల్‌ను స్వాధీనం చేసుకుని డంపర్ షెడ్‌లో భద్రపరిచారు. అనంతరం చోరీతో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించి మణుగూరు పోలీసులకు అప్పగించారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తతను అధికారులు అభినందించారు.



## పేదల పాలిట మహానేత వైఎస్సార్

**మణుగూరు, మహా:** పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు చిరస్మరణీయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేశారని, మహిళా సంఘాలకు పావలా వడ్డీతో ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. 108 అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి వైద్యరంగంలో మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకుని సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిన ప్రజానాయకుడిగా వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పాయం పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమానికి కృషి చేయడమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై వ్యాఖ్యలు సహించేది లేదు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, హింసను ప్రేరేపించేలా వ్యవహరించడం సరికాదని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా దేశ సమైక్యత, సమగ్రత, సమానత్వం, సౌభ్రాతృత్వానికి మార్గదర్శకంగా నిలిచారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు. హింస, వేర్పాటువాదాన్ని ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలను ఖండించిన వారిలో సంఘ నాయకులు అపరబాలు అల్లి శంకర్, తాండూర్ ధనరాజ్, గుండా రమేష్, మచ్చా పృథ్వీరాజ్, బొమ్మెర అశోక్ తదితరులు ఉన్నట్లు తెలిపారు.



# గ్రామాల అభివృద్ధికి అండగా ఉంటా..

- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం..
- ఇరువురికి రూ.1.06 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు..
- అందజేసిన ఎమ్మెల్యే పాయం...



**మణుగూరు, మహా :** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఆయనను కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన మొత్తం రూ.లక్షా ఆరు వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

**సాంబాయిగూడెం సమస్యలు పరిష్కరించండి**

మణుగూరు మండలం సాంబాయిగూడెం గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ చీడేం ఉషారాణి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ప్రజల రాకపోకలకు వీలుగా బస్సు రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

**రామానుజవరం అభివృద్ధికి నిధులివ్వాలి**

మండలంలోని రామానుజవరం గ్రామపంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఉప సర్పంచ్ కొడారి రాణి, తమ్మిశెట్టి సాంబ, కట్ట నర్సింహారావు, దేగల కృష్ణారావులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టడంతో పాటు అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండు గ్రామాల ప్రజాప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

**ఇద్దరికి రూ.లక్షా ఆరు వేల వైద్య సాయం**

అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆళ్లపల్లి మండలం ముత్తాపురం గ్రామానికి చెందిన ఈసం జయసుధకు మంజూరైన రూ.46 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా జిల్లకర్ర నాగార్జునకు మంజూరైన రూ.60 వేల చెక్కును అందించారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. సహాయ నిధి చెక్కు అందుకున్న జిల్లకర్ర నాగార్జున ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

- విద్యార్థులకు అభినందనలు వెలువ
- సింగరేణి కళాశాలకు మరింత పేరు తీసుకురావాలని సూచన



**భద్రాద్రి కొత్తగూడెం,మహా:** తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్తంగా హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఇటీవల తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోటీలలో కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో కళాశాలకు చెందిన సీనియర్ సిఇసి విద్యార్థిని చింతల వేదశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకం గెలుచుకుంది. అలాగే సిఇసికి చెందిన డి.మధు ప్రియ ఆమె బృందం అద్భుతమైన ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ విజయం కళాశాలకు సింగరేణి సంస్థకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా స్వర్ణ, కాంస్య పతకాలు సాధించిన సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థినీలను బుధవారం సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) సెక్రటరీ జి.రాజేంద్ర ప్రసాద్, జాయింట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి.కాంతారావు, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత, పిఈటి అరుణశ్రీ అభినందించి భవిష్యత్తులో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి సింగరేణి సంస్థకు కళాశాలకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాధించిన విజయం పట్ల కళాశాల అధ్యాపకులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ వీరికి అభినందనలు తెలియజేశారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సైబర్ మోసాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అబ్దుల్ కలాం కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, నకిలీ పోలీస్ అధికారుల పేరుతో బెదిరింపులు, పెట్టుబడులపై అధిక లాభాల ఆశ చూపడం, నకిలీ లింకులు, యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని వివరించారు. విద్యార్థులు వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు అపరిచితులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేస్తే ఫొటో మార్ఫింగ్, ఆన్‌లైన్ వేధింపుల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణి



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం భీక్యాతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఖమ్మంకు చెందిన ఎవర్ గ్రీన్ ప్రాజెక్ట్ రియల్ ఎస్టేట్ ఆర్థిక సహకారంతో క్రీడా దుస్తులను అందజేశారు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, ఎంఈఓ దుగ్గిరాల జయరాజ్ లు ప్రభుత్వం అందించిన యూనిఫాంలతో పాటు స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వివిధ రూపాల్లో సహకరించడం అభినందనీయం అన్నారు. క్రీడా దుస్తులు అందించిన ఎవర్ గ్రీన్ రియల్ ఎస్టేట్ అధినేతలు పర్సగాని నాగేశ్వరరావు, దావా సత్యనారాయణ లను గ్రామ పంచాయతీ పాలకవర్గం అభినందించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, కాంప్లెక్స్ హెచ్ఎం సాల్మన్ రాజ్, పాఠశాల హెచ్ఎం వనజరాణి, శోభారాణి, డాక్టర్ బిందు, గ్రామ పెద్ద బిచ్చ నాయక్,వార్డు సభ్యులు మాలోత్ విజయ, వాంకుడోత్ రమేష్, సీసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శిరీష హంతకుడిని కఠినంగా శిక్షించాలి



**కారేపల్లి, మహా:** ఆదివాసీ గిరిజన నర్సింగ్ విద్యార్థిని ఊకే శిరీషపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. బుధవారం కారేపల్లిలో నిర్వహించిన ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మహిళలకు పూర్తి భద్రత కల్పించాలని కోరారు. మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేసి నిందితులను త్వరితగతిన గుర్తించి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఐద్వా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## హాస్టల్ వర్కర్లకు రూ.15,600 వేతనం

**మణుగూరు, మహా:** పీఎంహెచ్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు జీఓ నెం.60 ప్రకారం నెలకు రూ.15,600 వేతనం చెల్లించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ జాబ్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. జీఓ నెం.1348 కింద జిల్లాకు మంజూరైన 30 పోస్టుల్లో సీనియారిటీ ఆధారంగా అర్హులైన వర్కర్లను నియమించాలని కోరారు. ప్రస్తుతం క్యాటరింగ్ విధానంతో కేవలం రూ.10,070 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేసి జీఓ 60 ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, వేతనంతో కూడిన సెలవులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన వర్కర్ల కోసం అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలి

మణుగూరు, మహా : మణుగూరు ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సేవా దృక్పథం ఉన్నవారు సహకరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ కోరారు. ప్రతిరోజూ 300 నుంచి 500 మందికి పైగా రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారని తెలిపారు. అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బందితో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ నర్సింగ్ కళాశాల యాజమాన్యం రూ.20 వేల విలువైన రిఫ్రిజిరేటర్, భద్రాచలం రామకృష్ణ హాస్పిటల్ యాజమాన్యం రూ.15 వేల విలువైన ఫర్నిచర్‌ను ఆసుపత్రికి వితరణగా అందించాయి. దాతలకు వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. బుధవారం కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న హామీ కూడా నెరవేరలేదన్నారు. రైతుబీమా, కౌలు రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి ఎగ్జిక్యూటివ్‌ల సమస్యలు పరిష్కరించాలి

**మణుగూరు, మహా:** సింగరేణి ఎగ్జిక్యూటివ్‌లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను సెప్టెంబర్ 12లోగా పరిష్కరించాలని సీఎంఓఏఐ-సింగరేణి బ్రాంచ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. జూలై 13న జరిగిన చర్చల్లో రెండు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు. పారిశ్రామిక శాంతి, సుహృద్భావ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో చేపట్టాల్సిన ఆందోళనలను వాయిదా వేసినట్లు తెలిపారు.ఎగ్జిక్యూటివ్‌ల పే అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనకు వెంటనే ఆమోదం తెలిపి రానున్న బోర్డు సమావేశంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాలకు సంబంధించిన పీఆర్పీ బకాయిలను అర్హులైన ఎగ్జిక్యూటివ్‌లకు విడుదల చేయాలని కోరారు. అలాగే సీఎంఓఏఐ-సింగరేణి బ్రాంచ్‌తో తక్షణం సమావేశం నిర్వహించి మిగిలిన సమస్యల పరిష్కారానికి కాలపరిమితి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 12లోగా స్పష్టమైన చర్యలు లేకుంటే తదుపరి కార్యాచరణపై పునరాలోచిస్తామని అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, ఉపాధ్యక్షుడు పొనుగోటి శ్రీనివాస్ హెచ్చరించారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



**మణుగూరు, మహా :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మణుగూరులోని రేణుకా చౌదరి క్యాంపు కార్యాలయంలో రేణుకా అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ నాయకుడు గురిజాల గోపి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పూనెం సరోజ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. రైతులు, పేదలు, మహిళలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తుచేశారు. ప్రజల హృదయాల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఎండీ షబానా, కోరి శ్యామల, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం వసంత, విజయలక్ష్మి, రాజకుమారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాధవరెడ్డి, చారి, ఆంటోనీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్య కార్యక్రమాలపై నాటక ప్రదర్శన

- అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు.

**సత్తుపల్లి, సెప్టెంబర్ 2: మహా :** సామాజిక సమానత్వం, విద్య, హక్కుల సాధనకు కృషి చేసిన మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్.సి.సి.ఎల్) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సింగరేణి సత్తుపల్లి ఏరియా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొండేటి షడ్రక్ బాబు తెలిపారు. సత్తుపల్లిలోని సింగరేణి కార్మికుల వసతి గృహాల (పి.ఎన్.వి.ఆర్ కాలనీ) వేదికగా సెప్టెంబర్ 3, 4 తేదీల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 3న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం, ఆయన ఆశయాలు, సామాజిక చైతన్యంపై "సంఘం శరణం గచ్ఛామి" నాటక ప్రదర్శన, సెప్టెంబర్ 4న మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల జీవితాలు, విద్యా ఉద్యమం, సామాజిక సంస్కరణలపై "సత్యశోధన" నాటక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రెండు రోజులపాటు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే నాటక ప్రదర్శన కార్యక్రమాలకు ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కొండేటి షడ్రక్ బాబు పిలుపునిచ్చారు.

## శిరీష మృతిపై సమగ్ర విచారణ జరపాలి..

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ వేగవంతం చేయాలి..
- భద్రాచలం బార్ అసోసియేషన్ న్యాయవాదుల డిమాండ్..



**భద్రాచలం, మహా :** హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చవిటీగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ ఊకే శిరీష మృతిపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టుల ప్రధాన గేటు ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొడాలి శ్రీనివాసు, శ్రీనివాసాచారిలు మాట్లాడుతూ.. పేద ఆదివాసీ కుటుంబానికి చెందిన మహిళ నర్సుగా సేవలందిస్తూ అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. శిరీష మృతి వెనుక వాస్తవాలను వెలికితీసేందుకు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, ప్రభావాలకు తావులేకుండా ప్రభుత్వం ఉన్నతస్థాయి, పారదర్శక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిందితులు ఎంతటివారైనా చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. కేసు విచారణలో జాప్యం జరగకుండా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి విచారణ వేగవంతం చేయాలని కోరారు. శిరీషను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు అర్హులైన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వృత్తులు చేసుకుంటున్న మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగినుల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు న్యాయవాదుల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిరసనలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తాతా లలిత, లేడీ రిప్రజెంటేటివ్ తరుణి, మాజీ అధ్యక్షుడు కోట దేవదానం, సీనియర్ న్యాయవాదులు పలివెల నరసింహారావు, రావి రామ్మోహన్, పేరాల వెంకటేశ్వర్లు, పేరాల నాగరాజు, బండారు అరుణ్‌చంద్, కాపుల ప్రకాష్, చీమల నరసింహారావు, కె అరుణశ్రీ, అవులూరి సత్యనారాయణ, పామరాజు తిరుమలరావు, ఎంవీ రమా, నర్మదా, పాయం రవివర్మ, కొరసా కృష్ణార్జునరావు, బండారు రమేష్, ఉప్పు నాగేందర్, పి భాస్కరరావు, బి శారద, విద్యాధరి, దాట్ల సంధ్య, వలవల సురేష్‌కుమార్, బి రామకృష్ణ, ఏ రజని, గాయత్రి, బివి కార్తీక్, కారం రమేష్, కొరసా నరేష్, ఎస్కే యాకోబ్ జానీ, అంజలి, లక్ష్మణ్, ఈసంపల్లి, సున్నం వెంకటరమణ, శ్రీనివాస్, పల్లంటి ప్రవీణ్‌కుమార్, చల్లా శివకృష్ణ, కోరాడ శ్రీనివాస్, అరవింద్, చందన, పసుపులేటి ఆశ్రిత, వరసా సునీత, ముదిగొండ కిరణ్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## కంటైనర్‌లో 100కు పైగా గోవులు



**దమ్మపేట, మహా:** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని భాగ్యనగర్ గోరక్షక్ బృందం సభ్యులు బుధవారం దమ్మపేట శివారులో అడ్డుకున్నారు. గోవుల అక్రమ రవాణాపై సమాచారం అందడంతో బృందం సభ్యులు వాహనంపై నిఘా పెట్టారు. కొవ్వూరు వైపు నుంచి అనుమానాస్పదంగా వచ్చిన కంటైనర్‌ను ఆపేందుకు ప్రయత్నించగా డ్రైవర్ వేగంగా వెళ్లడంతో సభ్యులు వెంబడించి దమ్మపేట శివారులో నిలిపివేశారు. కంటైనర్‌ను తనిఖీ చేయగా 100కు పైగా గోవులను ఇరుకైన ప్రదేశంలో అత్యంత దారుణ పరిస్థితుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గోవులను సంరక్షణ నిమిత్తం నూజివీడు సమీపంలోని గోశాలకు తరలించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# సహజ అందంతో ఆకట్టుకుంటున్న మానస వారణాసి

నటి మానస వారణాసి తన సహజమైన అందం, సింపుల్ లుక్‌తో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించారు. సోషల్ మీడియాలో ఆమెకు సంబంధించిన ఓ అందమైన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేకుండా సహజమైన లుక్‌లో కనిపించిన మానసను చూసి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.పచ్చదనం నిండిన అందమైన వాతావరణంలో తీసిన ఈ ఫొటోలో మానస ఎంతో ప్రశాంతంగా, హుందాగా కనిపించారు. నల్లటి జుట్టు ఆమె ముఖాన్ని మరింత అందంగా చూపిస్తుండగా, ముఖంపై కనిపించిన చిన్న చిరునవ్వు ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన తోటలో పూసిన గులాబీ రంగు పువ్వును చేతిలో పట్టుకుని చెంపకు దగ్గరగా ఉంచిన ఆమె పోజ్ అందరినీ ఆకట్టుకుంటోంది. తలను కొద్దిగా వంచి ఇచ్చిన పోజ్, లైట్ పోల్కా డాట్ టాప్ ఆమె సహజ అందాన్ని మరింతగా హైలైట్ చేశాయి. మానస చేతిలో ఉన్న పింక్ ఫ్లవర్ కేవలం ఫొటోకు అందం కోసం ఉపయోగించిన వస్తువులా కాకుండా, ఆమె వ్యక్తిగత జీవితంలోని చిన్న ఆనందాలకు ప్రతీకగా కనిపిస్తోంది. బిజీ షెడ్యూల్ మధ్య కూడా తన ఇంటి తోటను, ప్రకృతిని ఆస్వాదించే మానసకు ఈ పువ్వు ప్రత్యేకమైన అనుబంధాన్ని కలిగిస్తుందని తెలుస్తోంది.సినీ రంగంలోకి అడుగుపెట్టిన తర్వాత మానస వారణాసి తన ప్రతిభతో మంగా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. సహజమైన హావభావాలు, ఎక్స్‌ప్రెసివ్ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనా పరిధిని పెంచుకుంటున్నారు. గ్లామర్ కంటే సహజమైన అందం, సింపుల్ ఎక్స్‌ప్రెషన్స్‌తోనే అభిమానులను ఆకట్టుకోవడం మానస ప్రత్యేకతగా చెప్పొచ్చు.ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారింది. మానస వారణాసి కెరీర్ మరింత ముందుకు సాగుతున్నప్పటికీ, ఇలాంటి సాధారణమైన క్షణాలను ఆస్వాదిస్తూ తన వ్యక్తిగత జీవితంలోని ప్రశాంతతను కాపాడుకుంటున్న తీరు అభిమానులను మరింతగా ఆకట్టుకుంటోంది.

# నేపాల్ విపత్తుపై చలించిన సోనూ సూద్.. బాధితులకు అండగా నిలవాలని పిలుపు



నేపాల్‌లో సంభవించిన ప్రకృతి విపత్తు సృష్టించిన విషాదం ఇంకా అక్కడి ప్రజలను వెంటాడుతోంది. భారీ వరదలు, కొండచరియలు, నీటి ఉధృతికి అనేక ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా కూలిపోయిన ఇళ్లు, పేరుకుపోయిన శిథిలాలు, బురద ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. తమ ఆత్మీయులు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు. విపత్తు సంభవించి రోజులు గడిచినా సాధారణ పరిస్థితులు ఇంకా పూర్తిగా నెలకొనలేదు.ఈ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బాలీవుడ్ నటుడు సోనూ సూద్ నేపాల్‌లోని ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. అక్కడి దృశ్యాలను చూసిన ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. బాధితుల కష్టాలను దగ్గరగా చూసిన తర్వాత విపత్తు తీవ్రతను మాటల్లో చెప్పడం కష్టమని పేర్కొన్నారు. ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులైన ప్రజలకు ప్రస్తుతం పెద్దఎత్తున సహాయం అవసరమని తెలిపారు.విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో వరద నీరు ఎంత ఎత్తు వరకు ప్రవహించిందో అక్కడి ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని సోనూ సూద్ చెప్పారు. నీటి ప్రవాహంతో పాటు శిథిలాలు కొట్టుకురావడంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు ఎత్తైన ప్రాంతాలను ఆశ్రయించాల్సి వచ్చిందని వివరించారు. వారం రోజులు గడిచినా విధ్వంసం ఆనవాళ్లు తొలగిపోకపోవడం నష్టం ఏ స్థాయిలో జరిగిందో తెలియజేస్తోందన్నారు.బాధితులకు తక్షణ అవసరాలు ఏమిటన్నది తెలుసుకునేందుకు తన బృందం క్షేత్రస్థాయిలో పనిచేస్తోందని సోనూ సూద్ తెలిపారు. స్థానికులను కలిసి వారికి కావాల్సిన సహాయంపై వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. తన స్నేహితులు, సహచరులతో కలిసి సాధ్యమైనంత ఎక్కువ మందిని సహాయక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.అయితే ఈ బాధ్యత ఒక్కరి లేదా ఒక్క బృందం పరిధిలోనే ఉండకూడదని సోనూ సూద్ అభిప్రాయపడ్డారు. నేపాల్ ప్రజలకు ప్రస్తుతం విస్తృతమైన సహాయం అవసరమని, ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారు స్పందించి తమకు సాధ్యమైన సహకారం అందించాలని కోరారు. ప్రకృతి విపత్తుతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి సమష్టి కృషి అవసరమని అన్నారు.ఇదిలా ఉండగా, ఈ విపత్తులో ప్రాణనష్టం కూడా భారీగా నమోదైనట్లు సమాచారం. ఘటన జరిగిన ఎనిమిది రోజుల అనంతరం మృతుల సంఖ్య 1,127కు చేరినట్లు తెలుస్తోంది. మరోవైపు సుమారు 4,000 మంది వరకు గల్లంతైనట్లు సమాచారం. దీంతో వారి ఆచూకీ కోసం రెస్క్యూ బృందాలు విస్తృతంగా గాలింపు చేపడుతున్నాయి. త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు కూడా విపత్తు ప్రభావానికి గురైనట్లు సమాచారం. అక్కడి సొరంగాల్లో కొందరు చిక్కుకుపోయినట్లు తెలియడంతో వారిని సురక్షితంగా బయటకు తీసేందుకు ప్రత్యేక సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేపాల్ బృందాలతో పాటు భారత్, చైనా, కొరియా, ఆస్ట్రేలియాకు చెందిన రెస్క్యూ నిపుణులు కూడా సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం.ఒకవైపు గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతుండగా, మరోవైపు ఇళ్లు, ఆస్తులు, జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలకు పునరావాస సహాయం అందించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోనూ సూద్ నేపాల్‌లో స్వయంగా పరిస్థితులను పరిశీలించడం, బాధితులకు సహాయం చేయాలని ప్రజలకు పిలుపునివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. విపత్తు నుంచి నేపాల్ కోలుకునే వరకు బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని ఆయన ఇచ్చారు.

## శ్రీకృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా 'దేవరాయ' చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక కానుక అందించింది. ఈ ప్రతిష్ఠాత్మక సినిమాలో సుదీప్ చారిత్రక పాత్రలో కనిపించబోతున్నట్లు అధికారికంగా వెల్లడించింది. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయల పాత్రను ఆయన పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది.విడుదల చేసిన గ్లింప్స్‌లో సుదీప్ రాజసం, గంభీరమైన హావభావాలతో ఆకట్టుకున్నారు. ఇప్పటివరకు మాస్, యాక్షన్ పాత్రలతో ప్రేక్షకులను అలరించిన సుదీప్.. తొలిసారి ఇలాంటి చారిత్రక పాత్రలో కనిపించనుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సుప్రియాన్వి పిక్చర్ స్టూడియోస్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి గౌర హరి సంగీతం అందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న 'దేవరాయ'ను 2027 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సుదీప్ కెరీర్‌లో ఈ సినిమా ఓ ప్రత్యేక ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.






## ఆస్పత్రిలో మమితా బైజు.. ఆస్ట్రేలియా పర్యటన రద్దు

మలయాళ నటి మమితా బైజు అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె షెడ్యూల్‌లో ఉన్న ఆస్ట్రేలియా పర్యటన రద్దయినట్లు సమాచారం.మెల్‌బోర్న్‌లో నిర్వహించనున్న 'Clyde Onam 2026' వేడుకలకు మమితా బైజు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆమె ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉండగా, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆమె పాల్గొనాల్సిన ఓనం వేడుకను నిర్వాహకులు కూడా వాయిదా వేసినట్లు సమాచారం. ఆమె ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం కార్యక్రమానికి కొత్త తేదీని ప్రకటించే అవకాశం ఉంది. ఇటీవల మమితా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి ఆదరణ పొందింది. నటి ఆస్పత్రిలో చేరిన విషయం తెలియడంతో అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఆమెకు ఎదురైన ఆరోగ్య సమస్య ఏమిటనే విషయంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. మమితా త్వరగా కోలుకుని తిరిగి షూటింగ్స్‌లో పాల్గొనాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# పారదర్శకతపై అశోక్ కుమార్ ఆరోపణలు

తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (TFPC) వ్యవహారశైలిపై ప్రముఖ నిర్మాత అశోక్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. కౌన్సిల్ కొందరి వ్యక్తిగత కార్యాలయంలా మారిందని, పాలనలో పారదర్శకత కనిపించడం లేదని ఆరోపించారు. ఇద్దరు సెక్రటరీలు ఉన్నప్పటికీ ఒకే వ్యక్తి ఆధిపత్యంలో వ్యవస్థ నడుస్తోందని అన్నారు. నెలవారీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించకుండా, ఆరు నెలల లెక్కలను వాట్సాప్ ద్వారా పంపుతున్నారని విమర్శించారు. సరైన బిల్లులు, ఆడిటింగ్ లేకుండా నిధులు వినియోగిస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లు, తప్పు ఫోన్ నంబర్లు, చిరునామాలు ఉన్నాయని అశోక్ కుమార్ పేర్కొన్నారు. కౌన్సిల్‌లోని లోపాలను ప్రశ్నిస్తున్నందుకే తనను ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. ఈ విషయంలో కోర్టును ఆశ్రయించగా తన అర్హతపై స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని చెప్పారు.చిన్న నిర్మాతలకు ఉచిత మెంబర్‌షిప్ అందించడంతో పాటు, వారి సంక్షేమానికి నిధులు వినియోగిస్తామని హామీ ఇచ్చారు. హెల్త్ ఇన్సూరెన్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి అత్యవసర పరిస్థితుల్లో నిర్మాతలకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. 'ట్రూత్, ట్రాన్స్‌ఫరెన్సీ, ట్రస్ట్' నినాదంతో తమ ప్యానెల్ ఎన్నికల బరిలో ఉందని, నిర్మాతలు ఆలోచించి ఓటు వేయాలని అశోక్ కుమార్ కోరారు. కోర్టు ప్రక్రియ పూర్తైన అనంతరం ఎన్నికల తేదీ ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు.





## కాస్మొటిక్ ట్రీట్మెంట్స్‌పై హేమా మాలిని ఆసక్తికర వ్యాఖ్యలు

బాలీవుడ్ డ్రీమ్ గర్ల్‌గా దశాబ్దాలుగా ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న సీనియర్ నటి హేమా మాలిని.. వయసు పెరుగుతున్న కొద్దీ అందాన్ని కాపాడుకోవడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వయసుతో వచ్చే సహజమైన మార్పులను అంగీకరిస్తూనే, అవసరమని భావిస్తే రూపాన్ని మెరుగుపరుచుకునేందుకు కాస్మొటిక్ ట్రీట్మెంట్స్ తీసుకోవడంలో తప్పులేదని ఆమె అభిప్రాయపడ్డారు.సినీ పరిశ్రమలో నటీనటులు ఎప్పటికీ యవ్వనంగా, ఆకర్షణీయంగా కనిపించాలనే ఒత్తిడి ఉంటుందని హేమా మాలిని పేర్కొన్నారు. అయితే అందాన్ని కేవలం సర్జరీలు లేదా కాస్మొటిక్ విధానాలతో మాత్రమే కాపాడుకోలేమని, ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా ఎంతో కీలకమని తెలిపారు. తన ఫిట్‌నెస్, ఆరోగ్యానికి నిత్యకృత్యంగా చేసే క్లాసికల్ డ్యాన్స్, యోగా, సమతుల్య శాకాహార ఆహారం ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. తగినంత నీరు తీసుకోవడం కూడా ఆరోగ్యంతో పాటు చర్మ కాంతిని కాపాడుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని వివరించారు.బాహ్య సౌందర్యంతో పాటు మన ఆలోచనలు, మానసిక ప్రశాంతత కూడా ముఖంలో ప్రతిబింబిస్తాయని హేమా మాలిని అన్నారు. ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండి సానుకూల దృక్పథాన్ని అలవర్చుకుంటే మనలోని ఆనందం సహజంగానే ముఖంలో కనిపిస్తుందని పేర్కొన్నారు. ఎలాంటి కాస్మొటిక్ విధానంతోనూ లభించని అంతర్గత ప్రశాంతత ఎంతో ముఖ్యమని తెలిపారు.సహజమైన జీవనశైలికి ప్రాధాన్యం ఇస్తూనే అవసరమైన సందర్భాల్లో ఆధునిక సౌందర్య చికిత్సలను స్వీకరించడంలో తప్పులేదన్న హేమా మాలిని వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com